


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 26-06-2022 సంపుటి: 03 సంచిక: 273 పేజీలు: 4 వెల: రూ 3-00


# దేశ రాజకీయాల్లోచర్చనీయంశమైన రాష్ట్రపతి పదవి



న్యూ డిల్లీ జూన్ 25రాష్ట్రపతి పదవికి సంబంధించిన సందడి ఇపుడు దేశ రాజకీయాల్లో చోటు చేసుకుంది. అధికార పక్షం బీజేపీ నుంచి ద్రౌపది ముర్ము పోటీ చేస్తూంటే విపక్షాల ఉమ్మడి అభ్యర్ధిగా కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్ హా రేసులో ఉన్నారు. ఇద్దరికీ ఈ ఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకం అని చెప్పాలి.ఈసారి జరిగే ఎన్నికల కోసం ఎందుకంత పంతం అంటే 2024 ఎన్నికలే అని సులువుగా చెప్పాలి. ఈసారి కచ్చితంగా ఏ పార్టీకి ఫుల్ మెజారిటీ రాదు అన్నది ఇప్పటికి ఉన్న విశ్లేషణలు. ఏదో అద్భుతం జరిగితే తప్ప ఏ ఒక్క పార్టీ కూడా సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధైర్యంగా చెప్పలేని స్థితి. ఇక బీజేపీకి ఇప్పటికి రెండు దఫాలుగా ఫుల్ మెజారిటీ ఇచ్చేసిన జనాలు మూడవసారి కాస్తా మోజు తగ్గి మెజారిటీకి దూరంగా ఉంచుతారు అని అంటున్నారు.సరిగ్గా ఇలాంటి సమయం కోసమే విపక్షాలు ఎదురుచూస్తున్నాయి. అవన్నీ కలసి ఫ్రంటుగా కట్టి రాష్ట్రపతిని కలిస్తే ప్రభుత్వం ఏర్పాటుకు పిలుస్తారు అన్న ఆశలు ఉన్నాయి. అయితే ఇక్కడే రాష్ట్రపతి పాత్ర చాలా ఇంపార్టెంట్. విచక్షణతో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. తనకు ఎవరు ప్రభుత్వాన్ని మెజారిటీతో నడుపుతారు అన్న నమ్మకం రాష్ట్రపతిని కలిగితే వారినే పిలిచి సర్కార్ ఏర్పాటుకు ఆహ్వానం పలుకుతారు.అందుకే రాష్ట్రపతి భవన్ లో తాము ప్రతిపాదించిన అభ్యర్ధి గెలిస్తే బాగుంటుంది అన్న ఆలోచనతోనే అటూ ఇటూ పోటీ పడుతున్నాయి. ఇదిలా ఉంటే రాష్ట్రపతి పదవి అంటే రబ్బర్ స్టాంప్ అని విమర్శలు చేసేవారికి జవాబు చెప్పాలీ అంటే చాలానే ఉంది. రాష్ట్రపతికి రాజ్యాంగం ప్రకారం చాలా విశేష అధికారాలు ఉన్నాయి. ఆయన ప్రధానిని నియమిస్తారు ఆయన మంత్రిమండలి ఇచ్చే సలహాతో తాను ప్రభుత్వాన్ని నడుపుతారు.ఈ దేశంలో అమలు అయ్యే ప్రతీ చట్టం రాష్ట్రపతి సంతకం చేశాకే వెలువడుతుంది. ఇక దేశ అత్యున్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తిని కూడా రాష్ట్రపతి నియమిస్తారు. హైకోర్టులలో న్యాయమూర్తులను కూడా ఆయనే నియమిస్తారు. అలాగే త్రివిధ దళాధిపతులకు ఆయన నాయకత్వం వహిస్తారు. ఇక రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 నుంచి 360 దాకా పేర్కొన్న మేరకు చూస్తే రాష్ట్రపతికి విశేష అధికారాలు ఉన్నాయి. అవి ఎంతవి అంటే పౌరులకు ఉన్న ప్రాధమిక హక్కులను ఆయన రద్దు చేయవచ్చు.ఇక పార్లమెంట్ నుంచి బిల్లులు ఆయన ఆమోదం కోసం వస్తే ఆయన తిరస్కరించి పంపవచ్చు. ప్రధానికి ప్రభుత్వాధినేత అని అంటే రాష్ట్రపతిని దేశాధినేతగా చెబుతారు. ఎందుకంటే దేశం మొత్తం ఆయన గుప్పిట ఉంటుంది. ఇక ప్రభుత్వాల ఏర్పాటులో రాష్ట్రపతి నిర్ణయం ఫైనల్. ఆయన్ని ప్రశ్నించే పరిస్థితి అయితే లేదు. అలాగే తాను నియమించిన ప్రధానులకు టైమ్ ఇచ్చి మెజారిటీ నిరూపించుకోమని కోరవచ్చు. వారు అందులో ఫెయిల్ అయితే రాష్ట్రపతి క్షణాలలో తప్పించవచ్చు.ఇక మెజారిటీతో నిమిత్తం లేకుండా రాష్ట్రపతి తాను అనుకున్న తీరున ప్రధాని పనిచేయలేదు అనుకుంటే ఆ సర్కార్ ని రద్దు చేసే అధికారాన్ని కలిగి ఉంటారు. వాటిని విశేష అధికారాలు అని చెబుతారు. రాష్ట్రపతి అంటే నడిచే రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి ఉన్న న్యాయ శాసన కార్యనిర్వాహక వ్యవస్థలు అన్నీ ఆయన కంట్రోల్ లోనే పనిచేస్తాయి.

# కోనసీమ విధ్వంసంపై దాఖలైన పిల్ కొట్టివేత!

## నిస్సార వ్యాజ్యాలు దాఖలుచేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరిక



అమరావతి జూన్ 25 ;ఆంధ్రప్రదేశ్ లో కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరును పెడుతూ జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మే 24న అమలాపురంలో అల్లర్లు విధ్వంసం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో పోలీసులు 200 మందికి పైగా అరెస్టు చేశారు.విచారణకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులపై రౌడీషీట్లు మోపడానికి చర్యలు తీసుకుంటున్నారు. అలాగే మంత్రి విశ్వరూప్ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ ఇళ్లను పలు ప్రైవేటు ఆర్టీసీ బస్సులను పోలీసు వాహనాలను దహనం చేసినవారి ఆస్తుల స్వాధీనానికి చర్యలు చేపడుతున్నారు.ఈ నేపథ్యంలో ఈ హింసాత్మక ఘటనలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. ఇలాంటి వ్యాజ్యాలు ప్రచారం కోసం లేదా రాజకీయ ప్రయోజనం కోసం దాఖలు చేస్తుంటారని హైకోర్టు వ్యాఖ్యానించింది. నిస్సార వ్యాజ్యాలు దాఖలుచేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించింది.ఈ క్రమంలో పిటిషనర్ కు 25 లక్షల రూపాయల జరిమానా విధించడానికి హైకోర్టు సిద్ధమైంది. అయితే పిటిషనర్ తరఫు న్యాయవాది క్షమాపణ కోరడంతో హైకోర్టు ఆ జరిమానాను ఉపసంహరించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్కుమార్ మిశ్రా జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది.కోనసీమ అల్లర్లపై నమోదైన కేసుల దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ సామాజిక కార్యకర్త కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి హైకోర్టులో పిల్ వేశారు. ఈ సందర్భంగా ఆయన తరఫున న్యాయవాది శివప్రసాద్రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అల్లర్లలో అధికార పార్టీ వైఎస్సార్సీపీ కౌన్సిలర్ పాత్ర ఉందన్నారు. ఇంకా మరికొందరు అధికార పార్టీ నేతలు ఈ విధ్వంసంలో ఉన్నారని తెలిపారు. వారిని పోలీసులు నిష్పక్షపాతంగా విచారించడం లేదని హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఆ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ. .రాజకీయ వ్యవహారంతో తమకు సంబంధం లేదని బాధ్యులపై పోలీసులు చర్యలు తీసుకుంటారని వ్యాఖ్యానించింది.

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం జగన్ అడుగులు: వైవీ సుబ్బారెడ్డి



ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సొంత రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణను అందించే లక్ష్యంతో హాస్పిటల్స్, హెల్త్ సెంటర్లను ప్రభుత్వం బలోపేతం చేసిందని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అమెరికాలోని శాన్ అంటోనియో, టెక్సాస్ లో జరుగుతున్న అమెరికన్ అసోసియేషన్ ఫర్ ఫిజిషియన్స్ అఫ్ ఇండియన్ ఆరిజన్ (ంంఖఎ, ఆపి) మహాసభలలో మాజీ లోక్ సభ సభ్యులు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య రంగంలో చేపట్టిన, చేపట్టబోతున్న అభివృద్ధి గురించి ఆయన వివరించారు. గ్రామ స్థాయిలో ఇంటింటికీ ఆరోగ్య సేవలను అందించడమే లక్ష్యంగా 10,032 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్లను ఏర్పాటు చేశారు. ప్రతి క్లినిక్లో ఒక ఏఎన్ఎం, ఒక మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, ఒక ఆశా వర్కర్ను నియమించారు. నాడు-నేడులో భాగంగా 977 పీహెచ్సీలు పునరుద్ధరించారు. అదే విధంగా 148 పీహెచ్సీలు నిర్మాణంలో ఉన్నాయి. అంతే కాకుండా పట్టణాలలో 556 పీహెచ్సీలు ఏర్పాటు చేశారు. ప్రతీ 30,000 జనాభాకు ఒక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఙఖఊఅ)తో పాటు అందుకు సరిపడా సిబ్బందిని నియమించారు. ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి నాడు-నేడు కింద ప్రభుత్వం రూ.12,268 కోట్లను కేటాయించింది. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో కనీసం ఒక మెడికల్ కళాశాల ఉండేలా రూ.7,880 కోట్ల అంచనా వ్యయంతో 16 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ కాలేజీల్లో 1,850 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. 750 ఎంబీబీఎస్ సీట్లకు 2023-24 అడ్మిషన్ల కోసం 5 కొత్త మెడికల్ కాలేజీలు తెరవబడతాయి.సుమారు రూ.43 కోట్ల వ్యయంతో 5 జనరల్ హాస్పిటల్స్ టీచింగ్ హాస్పిటల్స్గా అప్గ్రేడ్ చేస్తున్నారు. పెరుగుతున్న డిమాండ్ని దృష్టిలో ఉంచుకుని వైద్య మౌలిక సదుపాయాలు, సౌకర్యాలను బలోపేతం చేయడం, సమీపంలోనే ప్రజలకు ఎండ్ టు ఎండ్ మెడికల్ కేర్ని అందుబాటులో ఉంచడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఇవే కాకుండా జెనెటిక్స్, బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్, ఇమ్యునాలజీ వంటి అసాధారణ విభాగాలతో కూడిన అత్యాధునిక ప్రపంచ స్థాయి పీడియాట్రిక్ (చిన్న పిల్లల) సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ను ప్రారంభించింది.

# ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉంది: మంత్రి బుగ్గన

అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ మెరుగైన ఆర్థిక నిర్వహణ, ఆర్థిక క్రమశిక్షణతో రికార్డు సృష్టించిందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రతిపక్ష టీడీపీ, దాని స్నేహపూర్వక మీడియా అబద్ధాలు వల్లె వేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కరానా వ్యాప్తి ఉన్నప్పటికీ అధికారులు బాగా పనిచేశారని అభిప్రాయపడ్డారు. టీడీపీ పాలనలో రాష్ట్ర అప్పులు బాగానే ఉన్నాయని, ఇప్పుడు అప్పటికన్నా ఆర్థిక పరిస్థి ఎంతో మెరుగ్గా ఉన్నదన్నారు.గత ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య వార్షిక రుణ వృద్ధి రేటు 19.2 శాతం ఉండగా, వైసీపీ ప్రభుత్వంలో 15.77కి తగ్గించామని మంత్రి బుగ్గన చెప్పారు. రాష్ట్ర ఆర్థిక లోటు గత ప్రభుత్వంలో సగటున జీఎస్డీపీలో 4 శాతంగా ఉండగా.. 2021-22లో 2.10 శాతంగా ఉన్నదన్నారు. అలాగే, రాష్ట్రాన్ని శ్రీలంకతో పోల్చినందుకు ప్రతిపక్షాలు తమ తప్పును తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) పథకాల కింద పారదర్శకంగా రూ.1.46 లక్షల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా పంపిణీ చేసిందని, డిబిటియేతర పథకాల కోసం మరో రూ.44,000 కోట్లు ఖర్చు చేసిందని గుర్తు చేశారు.2014-19 మధ్య టీడీపీ హయాంలో రూ.27,340 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ పనులు జరగ్గా.. గత మూడేండ్లలో మొత్తం రూ.27,448 కోట్ల పనులు చేపట్టినట్లు మంత్రి వివరించారు. టీడీపీ హయాంలో రుణాలపై సగటు వడ్డీ రేటు 8 శాతంగా ఉండగా.. ప్రస్తుతం 7 శాతంగా ఉన్నదన్నారు.




14, 15 ఆర్థిక సంఘం నిధులపై ప్రతిపక్షాలు దురుద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. స్థానిక సంస్థల విద్యుత్ ఛార్జీల పెండింగ్లో ఉన్న రూ.2,200 కోట్ల బకాయిలను ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. కొవిడ్ వ్యాప్తిలో ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వంలో 2014-19 మధ్య భారీ, మధ్య తరహా ప్రాజెక్టులలో సగటు పెట్టుబడి రూ.11,994 కోట్లుగా ఉన్నదని ఆయన చెప్పారు.

# శ్రీకాకుళం జిల్లాలో సీఎం జగన్ పర్యటన ఇలా..

శ్రీకాకుళం (పీఎన్కాలనీ): సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ఈ నెల 27న జిల్లా పర్యటనకు రానున్న సందర్భంగా సీఎం అదనపు పీఎస్ కె.నాగేశ్వరరెడ్డి టూర్ షెడ్యూల్ను వివరిస్తూ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం ఉదయం 9 గంటలకు ఆయన నివాసం నుంచి బయల్దేరి 9.20 గన్నవరం ఎయిర్పోర్టుకి చేరుతారు. 9.30 గంటలకు విమానంలో బయల్దేరి విశాఖపట్నంకి 10.15కు చేరుకుంటారు. 10.25కు హెలీకాప్టర్లో విశాఖపట్నం నుంచి బయలుదేరి 11గంటలకు శ్రీకాకుళం చేరుకుంటారు. 11 నుంచి 11.15 వరకు ప్రజలు, అధికారులతో మాట్లాడుతారు.ఆర్అండ్బీ అతిథి గృహం వద్ద ఉన్న హెలీప్యాడ్ నుంచి బయల్దేరి కోడి రామ్మూర్తి స్టేడియానికి 11.25కు చేరుకుంటారు.

# ఉప ఎన్నికకు కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

అమరావతి : ఏపీలోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ఫలితాలు రేపు వెలువడనున్నాయి. ఉప ఎన్నికల కౌంటింగ్కు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 24న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 178 పోలింగ్ బూత్ ల పరిధిలో 2,13,644 మంది ఓటర్లు ఉండగా 1,37,038 (64.17 శాతం ) మంది తమ ఓటు హక్కును వినియోగించుకు న్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో పోలింగ్ జరగగా చేజర్ల మండలంలో అత్యధికంగా 67.9 శాతం , అత్యల్పంగా మర్రిపాడులో 59.8 శాతం నమోదైంది. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 82.49 శాతం ఓట్లు పోలవగా ఈ ఎన్నికల్లో 64.17 శాతం



మాత్రమే ఓట్లు పోలయ్యాయి. కౌంటింగ్కు ఎన్నికల అధికారులకు, సిబ్బందికి ఒకరోజు ముందుగానే శిక్షణ ఇచ్చి ఎన్నికల నిబంధనలను వివరించారు. ఉదయం 7 గంటలలోగా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.రేపు ఉదయం 11 గంటల వరకు పూర్తిస్థాయి ఫలితాలు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారుఏపీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ఆకస్మిక మరణంతో ఆత్మకూరుకు ఉప ఎన్నికను నిర్వహించగా 14 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. వీరిలో ప్రధానంగా అధికార వైసీపీ , బీజేపీ అభ్యర్థుల మధ్య గెలుపు, ఓటములు ఉంటాయని భావిస్తున్నారు.

# వైఎస్సార్ జిల్లాలో మెగా జాబ్ మేళా: సీఎం జగన్ ఆశయం.. పార్టీ లక్ష్యం తప్పక నెరవేరుతాయి

వైఎస్సార్: ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చదవాలన్నది సీఎం జగన్ ఆశయమని, రాష్ట్రంలో నిరుద్యోగి ఉండకూడదన్నది వైఎస్సార్సీపీ లక్ష్యమని రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. జిల్లాలోని ప్రొద్దుటూరు సీబీఐటీలో శనివారం ఉదయం పార్టీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాను ఎంపీ విజయసాయిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్య ప్రతి ఒక్కరి అవసరం. ఉద్యోగాల కోసం ప్రతీ ఒక్కరూ పోటీ పడుతున్న పరిస్థితుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా అవసరం. మహిళా సాధికారత కోసం సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఉ



ద్యోగం పొందితేనే కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయి. రాష్ట్ర తలసరి ఆదాయం పెరుగుతుందని చెప్పారాయన. అలాగే.. ఇంటర్వ్యూలను ధైర్యంగా ఎదుర్కొవాలని, ఇప్పుడు రానంత మాత్రాన మళ్లీ అవకాశం ఉంటుందని, జాబ్ మేళా నిరంతర ప్రక్రియ అని విజయసాయిరెడ్డి యువతకు భరోసా ఇచ్చారు.జాబ్ మేళాలో వందకు పైగా కంపెనీలు పాల్గొనగా.. ఉద్యోగాల కోసం 13 వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో.. ఎంపీ విజయసాయిరెడ్డితో పాటు డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఎంపీ అవినాష్రెడ్డి పాల్గొన్నారు. పార్టీ ఆధర్వ్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలకు అపూర్వ స్పందన లభిస్తోందని డిప్యూటీ సీఎం అమ్జాద్ బాషా పేర్కొనగా.. జగన్ ఆశయ సాధనకు అనుగుణంగా జాబ్ మేళా నిర్వహిస్తామని, నిరుద్యోగిరహిత లక్ష్య సాధన కోసం పార్టీ కృషి చేస్తుందని కడప ఎంపీ అవినాష్ రెడ్డి తెలిపారు.

# డీజీపీకి చంద్రబాబు లేఖ

అమరావతి చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలతపై పోలీసు వాహనం ఎక్కించడం, హత్య కేసులో సాక్షులను పోలీసులే బెదిరించడంపై టిడిపి జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర డిజిపికి లేఖ రాసారు. చిత్తూరులో కటారి అనురాధ దంపతుల హత్య కేసులో సాక్షులను బెదిరించి కేసును నీరు గార్చేందుకు స్థానిక పోలీసులు ప్రయత్నం చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. మాజీ మేయర్ కటారి అనురాధ దంపతుల హత్య కేసు విచారణలో జాప్యం చెయ్యకుండా నిందితులను శిక్షించాలని కుటుంబ సభ్యులు 22వ తేదీన అధికారులను కోరారు. స్థానిక పోలీసులు బాధితుల వినతిపై చర్యలు తీసుకోకుండా సాక్షులను బెదిరించేలా వ్యవహరించారు.

# సంపాదకీయం

ఆదివారం 26-06-2022

## పొంచి ఉన్న వలసల ముప్పు

50 సంవత్సరాలుగా వ్యవసాయ రంగం ఎక్కువగా యంత్రాలపై ఆధారపడుతున్నది. ఈ పరిస్థితులలో మట్టిలోని సేంద్రియతను పునరుజ్జీవింపచేసేందుకు చర్యలు చేపట్టకపోవడంతో భూసారం గణనీయంగా క్షీణించిపోయింది. మట్టిని పునరుజ్జీవింపచేయడానికి మొక్కలు, పశువుల వ్యర్థాలు అత్యంతావశ్యకం. అత్యాధునిక యంత్రాలు సైతం మనుషులు, పశువులకు బదులుగా పని చేయగలవు తప్ప మట్టిలో సేంద్రియతను చొప్పించలేవు. అందుకే మట్టిని పునరుజ్జీవింపచేసే చర్యల మీద ప్రపంచం దృష్టి సారించాలి. తక్షణ పరిష్కారంగా మట్టిలో మూడు నుంచి ఆరు శాతం సేంద్రియత అభివృద్ధి అయ్యేలా చర్యలు చేపట్టాలి. అత్యధిక భూభాగం చెట్ల నీడలో ఉండేలా, చెట్లు, జంతువుల వ్యర్థాల ద్వారా సమృద్ధం చేయాలి.'సద్గురు' ప్రారంభించిన 'మట్టిని రక్షించు' అనే మహోద్యమం ప్రపంచ ప్రజలనందరినీ ఏకం చేయడానికి యత్నిస్తుంది. తద్వారా మట్టి సంక్షోభాన్ని పరిష్కరించి, జాతీయ విధానాలు రూపొంది కార్యరూపం దాల్చడానికి అన్ని దేశాలకు తన మద్దతు అందిస్తుంది. 64 సంవత్సరాల సద్గురు ఒంటరిగా 21 మార్చ్ 2022న లండన్‌లోని ట్రాఫాల్గర్ స్క్వేర్ వద్ద 'సేవ్ సాయిల్' బైక్ ర్యాలీ ప్రారంభించారు. రోజుకు దాదాపు 300 కి. మీ. చొప్పున 100 రోజులలో 26 దేశాల గుండా 30,000 కి.మీ ప్రయాణించి 21 జూన్ 2022 కోయంబత్తూర్‌లో ముగించారు.ప్రపంచ మానవాళికి మట్టిలోని సేంద్రియత ప్రాముఖ్యతను, భూసారాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను, మట్టిని పునరుజ్జీవింపచేసే చర్యల గురించి చైతన్యం తీసుకువచ్చేలా విస్తృత ప్రచారం చేయడానికి పూనుకున్నారు. ఈ ప్రయాణంలో సద్గురు ప్రభావవంత వ్యక్తులతో చర్చలు నిర్వహిస్తారు. అన్ని దేశాల నాయకులతో సంప్రదింపులు జరుపుతారు. సద్గురు కృషికి ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు, ట్రెవర్ నోహ్, జో రోగన్ వంటి మీడియా వ్యక్తులు, ది లా సొసైటీ, యూకే పార్లమెంట్, నేపాల్ రాయబార కార్యాలయం వంటి విభాగాలతో పాటు చిన్న పిల్లలు, యువత, ఇలా సమాజంలోని అన్ని వర్గాల మద్దతు లభించింది. వివిధ దేశాల నేతలు 'సేవ్ సాయిల్' ఉద్యమంలో భాగస్వాములయ్యేందుకు, ఈషా ఫౌండేషన్‌తో కలిసి ముందుకు సాగేందుకు ఒప్పందాలపై సంతకాలు చేశారు.సద్గురు ప్రారంభించిన 'కావేరి కాలింగ్ ప్రాజెక్ట్' ద్వారా ఇప్పటివరకు 1,25,000 మంది రైతులు 62 మిలియన్ మొక్కలు నాటారు. తరిగిపోతున్న కావేరి నదీ జలాలను తిరిగి పెంచడానికి ఇది వీలు కల్పించిందని ఈషా ఫౌండేషన్ తెలిపింది. 'పెద్ద సంఖ్యలో పౌరులు పాల్గొన్నప్పుడు పర్యావరణ సమస్యలు ఎన్నికల సమస్యలుగా మారతాయి. ప్రభుత్వాలు విధానాలను అవలంబిస్తాయి. పర్యావరణ పరిష్కారాలను దీర్ఘకాలికంగా అమలు చేయడానికి బడ్జెట్‌ను కేటాయిస్తాయి' అని ఈ ఇనిషియేటివ్ అవుట్ రీచ్ పేజీ పేర్కొంది. 20 ఏండ్లలో ప్రపంచ జనాభా దాదాపు 930 కోట్లకు చేరుతుంది. ఆహారం మాత్రం 40 శాతం తక్కువ ఉత్పత్తి అవుతుందని అంచనా. దీంతో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడుతుంది. ఇప్పటికే 90 శాతం పోషక విలువలు కోల్పోయిన కూరగాయలు, సారం కోల్పోయిన మట్టి కారణంగా పోషక విలువలు లేని ఆహార ధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 కోట్ల మంది ప్రజలు దీంతో వివిధ జబ్బులకు లోనవుతు న్నారు. మన పూర్వీకులు ఒక ఆరెంజ్ ద్వారా పొందిన పోషక విలువలను నేడు మనం పొందడానికి కనీసం ఎనిమిది ఆరెంజ్‌లు తినాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే పోషక విలువలు ఏ స్థాయిలో అంతరించిపోయాయో అర్థం చేసుకోవచ్చు. వాన నీరు భూగర్భానికి చేరకపోవడం, వాన నీటిని సంరక్షించకుండా యథేచ్ఛగా తోడేయడంతో అతివృష్టి, అనావృష్టికి దారి తీస్తుంది. పెట్టుబడులకు తగిన నాణ్యమైన దిగుబడులు రాక రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. పెరుగుతున్న జనాభా, ఆహార, నీటి కొరత కారణంగా 2050 నాటికి దాదాపు 100 కోట్ల మంది ప్రజలు ఇతర ప్రాంతాలకు లేదా దేశాలకు వలస పోయే పరిస్థితి ఉత్పన్నం కావచ్చు. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడే 27 వేల రకాల జీవులు ఏటా అంతరించిపోవడం ఆందోళన కలిగించే పరిణామం. దాదాపు 80 శాతం పురుగుల జీవపదార్థం అంతరించే స్థాయికి సంక్షోభం చేరుకుంది. కార్బన్‌ను సంగ్రహించడంలో మట్టి పాత్ర చాలా కీలకం. కార్బన్ మట్టిలో మొక్కలలో కంటే మూడు రెట్లు, వాతావరణంలో కంటే రెండు రెట్లు ఎక్కువగా నిల్వ ఉంటుంది. ఇప్పటికైనా మట్టి పునరుజ్జీవనానికి పటిష్టమైన చర్యలు చేపట్టకపోతే అది 850 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేసి వాతావరణాన్ని విషతుల్యం చేస్తుంది. అందుకే మనం సద్గురు ప్రారంభించిన మట్టి పరిరక్షణ ఉద్యమానికి చేయూతనందించి మట్టి ఋణం తీర్చుకుందాం.

# ఏపీలో ఏసీడీ టెన్షన్

కాకినాడ, జూన్ 25,అద్దె ఇళ్లలో వుండేవారికి, యజమనులకు సత్సంబంధాలు వుండాలి. వున్ననాళ్లు అద్దె కడుతూండటం, ఇతరత్రా ఇబ్బందులు ఉంటే యజమానితో మాట్లాడుకోవడం పరిష్కరించుకోవడం జరుగుతుంటుంది. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విద్యుత్ శాఖ వారి ద్దరి మధ్య పెద్ద గొడవలే తెచ్చిపెడుతున్నాయి. అదే ఏసీడీ. అంటే వార్షిక విద్యుత్తు వినియోగం. అధికంగా వాడిన కరెంటు ఆధా రంగా వసూలుచేసే అదనపు విద్యుత్తు వాడక ధరావతు(ఏసీడీ). గత ఏడాది మార్చినుంచి ఈ ఏడాది ఏప్రిల్ మధ్యలో వాడిన కరెంటును నగటుగా తీసుకుంటున్నామని డిస్కమ్‌లు చెబుతున్నాయి.యేటా ఏసీడీ మొత్తానికి ఆరు శాతం వడ్డీని మార్చి లేదా ఏప్రిల్ నెల బిల్లులో చెల్లిస్తామని అంటున్నాయి. పట్టణాలు, నగరాల్లో అద్దె ఇళ్లలో ఉండే వారే ఎక్కువ. వారు తరచూ వివిధ కారణాలతో ఇళ్లు మారుతూ ఉంటారు. మామూలుగానే అద్దె విషయంలో ఇంతకు ముందున్నవారు ఎగ్గొట్టి పోతే దాన్ని కూడా కట్టాలనే యజమానులూ వున్నారు. అలాంటిది విద్యుత్ బిల్లుల విషయంలో మరీ పట్టు బట్టి లాక్కుంటున్నారు. అసలే అద్దె ఇళ్లు తగినవి దొరక్క ఇబ్బందులు పడే మధ్య తరగతి వారికి ఇలాంటి తలనొప్పులు నిత్యం వుంటూనే వుంటాయి. ఇప్పుడు రాష్ట్ర విద్యుత్ శాఖ నిర్ణయంతో మరింత సమస్యల్లో చిక్కుకోవలసి వస్తుంది. అంతకు ముందున్నవారు అత్యధిక విద్యుత్తును వినియోగిస్తే వాటికి సంబంధించి అదనపు విద్యుత్తు ధరావతుకు కొత్తగా అద్దెకు దిగినవారే బాధ్యత వహించాలి. ఈ ధరావతును అద్దె దారులే చెల్లించాలని ఇంటి యజమానులు దబాయిస్తున్నారు. రెండు నెలల కిందట అద్దెకు దిగిన తాము ఎందుకు చెల్లించా లని అద్దె దారులు నిలదీస్తున్నారు. దీంతో ఇంటి యజమానులకు, అద్దెకు వుండేవారి మధ్య గొడవలు తారస్థాయికి చేరుతు న్నాయి. ఏప్రిల్‌లో కొత్తగా అద్దెకు దిగేవారు ఎందుకు అంతకుముందు ఉన్న వారు కాల్చిన అధిక కరెంటుకు బాధ్యత పడాలనేది ఒక అంశమైతే, డిస్కమ్ చెబుతున్న ఆరు శాతం వడ్డీ లబ్ధి ఎవరికి చెందుతుందనేది మరో కీలక ప్రశ్న. ఏసీడీ విధానాన్ని ఏపీఈఆర్‌సీ ఆమోదించింది. వార్షిక విద్యుత్తు సగటుపైనే ఏసీడీ ఆధారపడి ఉంటుంది. యేటా ఏసీడీ మొత్తానికి ఆరు శాతం వడ్డీని మార్చి లేదా ఏప్రిల్ నెల బిల్లులో చెల్లిస్తాం. నెలవారీ 500 యూనిట్లు పైబడి కరెంటు వాడేవారికే ధరావతు వర్తిస్తుంది. వినియోగదారులు బిల్లులు చెల్లించలేక కనెక్షన్‌ను నిలుపుదల చేస్తే.. డిస్కమ్‌లకు చెల్లించాల్సిన మొత్తా లను మినహాయించుకుని ధరావతులో మిగిలిన మొత్తాన్ని వెనక్కు ఇచ్చేస్తాం. ఏసీడీపై ఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వ హించిందని వివరించాయి. అ డిస్కమ్‌ల ప్రతిస్పందనపై ఇంధన రంగ నిపుణుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకూ పరిశ్రమలు, వాణిజ్య వినియోగదారులకు మాత్రమే వర్తించే ఏసీడీ విధానం గృహ విద్యుత్తు వినియోగదారులకు వర్తింప జేయడంపై డిస్కమ్‌లు వివరణ ఇవ్వాలంటున్నారు. ఈ విధానం ఎప్పటి నుంచి ఉన్నదో డిస్కమ్‌లు చెప్పాలంటున్నారు. విద్యుత్ వినియోగం 500 యూనిట్లు దాటితే ఏసీడీ వర్తిస్తుందని డిస్కమ్‌లు చెబుతున్నాయి. కానీ, ఆ బెంచ్ మార్క్ దాటక ముందే కుటుంబం ఏప్రిల్ నెలలో కొత్త ఇంట్లో అద్దెకు దిగింది. ఆ కుటుంబానికి విద్యుత్తు కనెక్షన్‌కు ఈ ఏడాది మే నెలలో విద్యుత్తు వినియోగం కింద 5,623గా డిస్కమ్ పేర్కొంది. దీనిలోంచి అడ్జస్ట్‌మెంట్ పోగా 3070గా బిల్లు పంపింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్‌వరకూ సగటున 417 యూనిట్లు వినియోగించినట్లుగా పేర్కొంది. వారి సర్వీసు నంబరుకు రూ. 13,000 ఏసీడీ కింద చెల్లించాలని డిస్కమ్‌లు పేర్కొన్నాయి. రెండు నెలల కిందట అద్దెకు దిగిన తామెందుకు ధరావత్తు కట్టాలని ఆద్దెదారు వాదిస్తుం టే తమ కేమీ తెలియదని.. ఆ పోర్షన్‌కు సంబంధించిన విద్యుత్తును తాము వాడనందున ఆ ధరవత్తును అద్దెదారులే చెల్లించా లని యజమాని అంటున్నారు. ఇదేమైనా న్యాయంగా వుందా? అని అద్దెకున్న వారు వాపోతున్నారు.

## పక్క చూపులు చూస్తున్న గల్లా ఫ్యామిలీ

తిరుపతి, జూన్ 25,ఏపీలో తెలుగుదేశం పార్టీ పరిస్తితి కాస్త విచిత్రంగా ఉందనే చెప్పాలి?ఆ పార్టీ కాస్త పుంజుకున్నట్లే కనిపిస్తుంది?మళ్ళీ వెంటనే కిందకు పడుతున్నట్లు ఉంటుంది. అసలు టోటల్ గా పార్టీ పరిస్తితి కన్ఫ్యూజన్ గా ఉందని చెప్పాలి. సరే ఎలా ఉన్నా సరే అధినేత చంద్రబాబు మాత్రం పార్టీ కోసం ఇంకా కష్టపడుతూనే ఉన్నారు. ఈ వయసులో కూడా పార్టీని నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే చంద్రబాబు మాత్రం కష్టపడుతున్నారు గాని, కింద ఉన్న నేతలు మాత్రం ఆ స్థాయిలో పనిచేస్తున్నట్లు కనిపించడం లేదు. ఏదో కొందరు మాత్రమే ఎఫెక్టివ్ గా పనిచేస్తుంటే?మరికొందరు మొక్కుబడిగా పనిచేస్తున్నారు. ఇంకా కొందరు నేతలైతే పార్టీలో కనిపించడం లేదు. ఇలా పార్టీలో రకరకాల పరిస్తితులు ఉన్నాయి. ఇదే క్రమంలో కొందరు నేతలు పార్టీకి ప్లస్ అవుతుంటే, మరికొందరు మైనస్ అవుతున్నారు. అలాగే వైసీపీ నుంచి కొందరు టీడీపీలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తుంటే?.మరికొందరు పరిస్తితులని బట్టి టీడీపీని వదిలేయడానికి చూస్తున్నారు. టీడీపీ అధికారం కోల్పోయాక చాలామంది నేతలు వైసీపీ వైపుకు వెళ్ళిపోయారు. అయితే ఓ ఏడాది నుంచి పెద్దగా వలసలు నడవటం లేదు..వైసీపీలోకి ఏ టీడీపీ నాయకుడు వెళ్ళడం లేదు. ఇంకా రివర్స్ లో వైసీపీ నేతలే టీడీపీలోకి వచ్చే పరిస్తితి కనిపిస్తోంది. ఇక ఇలాంటి తరుణంలో టీడీపీకి పెద్ద షాక్ ఇచ్చేలా సీనియర్ నాయకురాలు గల్లా అరుణకుమారి స్టేట్మెంట్ ఉంది. గతంలో కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పనిచేసిన అరుణ?తర్వాత తన కుమారుడు జయదేవ్ తో కలిసి టీడీపీలోకి వచ్చేశారు. ఇక జయదేవ్ వరుసపెట్టి రెండు సార్లు గుంటూరు ఎంపీగా గెలిచారు. అటు అరుణ 2014లో పోటీ చేసి ఓడిపోయి, తర్వాత పోటీకి దూరమయ్యారు. ఇక రాజకీయంగా టీడీపీలో ఉన్నారు. కానీ తాజాగా తను రాజకీయాలకు దూరమవుతున్నట్లు ప్రకటించారు. సరే దూరమైతే దూరమయ్యారు?కానీ ఆమె ఇక్కడ ఊహించని ట్విస్ట్ ఇచ్చింది..తన కుటుంబంలో ఉన్నవారు అనుచరులు ఏ పార్టీలో భవిష్యత్ ఉంటుందో, ఆ పార్టీలోకి వెళ్లొచ్చని అన్నారు. అంటే పరోక్షంగా టీడీపీని వదిలి వెళ్లొచ్చని చెప్పారని అర్థం చేసుకోవచ్చు. ఇక అరుణ మాటలు చూస్తుంటే త్వరలోనే జయదేవ్ సైతం టీడీపీకి గుడ్ బై చెప్పేస్తారని కథనాలు వస్తున్నాయి. చూడాలి మరి గల్లా ఫ్యామిలీ..బాబుకు హ్యాండ్ ఇస్తుందో లేదో.

# సామాజిక లెక్కలతో కమలనాధులు..

**కమ్మ వర్గం దూరమవుతోందా**



విజయవాడ, జూన్ 25,రాష్ట్రపతి అభ్యర్థి విషయంలో బీజేపీ తీసుకున్న నిర్ణయం తెలుగు రాష్ట్రాల్లో పెద్ద చర్చగా మారింది. గత సంప్రదాయాలకు అనుగుణంగా ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడును రాష్ట్రపతిని చేస్తారని అంతా భావించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఆయన్ని హుటాహుటిన ఢిల్లీ రావాలని చెప్పడం.. ఆ తర్వాత అమిత్ షా తదితరులు వెంకయ్య దగ్గరకు వెళ్లి ప్రత్యేకంగా సమావేశం కావడంతో ఆయనే తదుపది రాష్ట్రపతి అభ్యర్థిగా అందరూ భావించారు. సంఖ్యా పరంగా ఎన్డీయేకు రాష్ట్రపతిని గెలిపించుకునే బలం ఉండటంతో.. చాలా సంవత్సరాల తర్వాత రాష్ట్రపతి పీఠంపై తెలుగువ్యక్తి.. వెంకయ్య నాయుడు కూర్చోబోతున్నారని సంతోషించారు తెలుగు రాష్ట్రాల జనం. కానీ.. బీజేపీ మరో నిర్ణయం తీసుకుంది. సామాజిక లెక్కల పేరుతో కమలనాధులు చేసిన వడపోతలపై ముఖ్యంగా తెలుగువారితోపాటు? మరీ ముఖ్యంగా కమ్మ సామాజికవర్గం చాలా గుర్రుగా ఉంది.వెంకయ్య నాయుడు మొదటి నుంచీ బీజేపీలోనే ఉన్నారు. తనను తాను కమ్మ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిగా ఎప్పుడూ చెప్పకపోయినా.. ఆ సామాజికవర్గంలో మాత్రం వెంకయ్యకు చాలా పెద్ద స్థానమే ఉంది. ఆ కోణంలోనే కమ్మ సామాజికవర్గానికి చెందిన చాలా మంది బీజేపీకి దగ్గరైన పరిస్థితి.. అలాగే ఎన్నికల్లో ఆదరించే వాతావరణం కనిపించేది. కానీ.. ప్రధాని మోడీ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ఆ వర్గాన్ని తీవ్రంగా నిరాశపర్చడంతోపాటు.. కమలంపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేసే పరిస్థితి కనిపిస్తోంది. ఈ విషయంలో ఆంధ్రాలోని కమ్మ సామాజికవర్గం ఒక విధంగా కుతకుతలాడుతోంటే.. తెలంగాణలోని కమ్మ సామాజికవర్గం మరో విధంగా ఆలోచిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావాలన్నది బీజేపీ ఆలోచన. ఇందుకు ప్రత్యేక ఆపరేషన్ కూడా చేపట్టింది. అయితే వెంకయ్యను రాష్ట్రపతిని చేయకపోవడంతో.. గుర్రుగా ఉన్న ఆ సామాజికవర్గం ఎన్నికల్లో బీజేపీకి ఎంత వరకు సహకరిస్తుంది అనేది ప్రస్తుతం పెద్ద ప్రశ్న.తెలంగాణలో కమ్మ సామాజికవర్గం ప్రభావం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కువ. అలాగే రాష్ట్రంలోని మిగతా చోట్ల కూడా కొన్ని సెగ్మెంట్లలో గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఆ వర్గం ఓటర్లు ఉన్నారు. అలాంటి నియోజకవర్గాల్లో బీజేపీ పరిస్థితి ఏంటనే చర్చ మొదలైంది. స్థానికంగా ఉన్న కమలనాథులు సైతం ఈ ప్రమాదాన్ని గ్రహించి మల్ల గుల్లాలు పడుతున్నారట. ఈ విషయాన్ని బీజేపీ తెలంగాణ అగ్రనాయకత్వం కూడా గుర్తించినా.. బయట పడటానికి సంకోచిస్తోంది. డ్యామేజ్ కంట్రోల్ ఎలాగో తెలియక ఆందోళన చెందుతున్నారట నాయకులు.రాజకీయ కోణంలో చూసినా.. తెలుగు రాష్ట్రాలతోపాటు దక్షిణాదిలో వెంకయ్య నాయుడికి రాజకీయ పరిచయాలు ఎక్కువ. పార్టీలకు అతీతంగా ఆయన్ని గౌరవిస్తారు. ఆంధ్రా, తెలంగాణలో అయితే కమ్మ సామాజికవర్గంతోపాటు మిగతా వర్గాలు కూడా వెంకయ్య రాష్ట్రపతి అయితే చూడాలని అనుకున్నాయి. అందుకే వెంకయ్య నాయుడిని రాష్ట్రపతిని చేసుంటే.. బీజేపీ తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా సానుకూల వాతావరణం ఏర్పడేదని.. దక్షిణాది రాష్ట్రాల్లోనూ పార్టీ మరింత బలోపేతానికి బాట పడేదనేది విశ్లేషకుల అభిప్రాయం. ఈ లెక్కలేవీ పరిగణనలోకి తీసుకోకుండా బీజేపీ నాయకత్వం తప్పులో కాలేసిందా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దేశంలో గడిచిన రెండు ఎన్నికల్లో ఉత్తరాదిలో బీజేపీ గట్టి పట్టే సాధించింది. దక్షిణాదిలో పాగా వేయడానికి వేయని ఎత్తులు జిత్తులు లేవు. అదే వెంకయ్యను రాష్ట్రపతిని చేసి ఉంటే.. ఆంధ్రా, తెలంగాణలో కమ్మ సామాజికవర్గం నుంచి సానుకూలత వ్యక్తం కావడంతోపాటు.. రాజకీయంగా బీజేపీకి కూడా కలిసి వచ్చేదని చెబుతున్నారు. వివాదరహితుడైన వెంకయ్యను కేవలం కమ్మ సామాజికవర్గమే కాకుండా తెలుగు వారంతా ఓన్ చేసుకుంటారు. ఆ విధంగా చూసినా.. బీజేపీకి రాజకీయంగా ప్లస్సే అయ్యేదని కొందరి వాదన. కానీ.. ఒకే ఒక్క నిర్ణయం.. బీజేపీపై ఒక సామాజికవర్గం ఆగ్రహానికి.. తెలుగువారిలో అసంతృప్తికి దారితీసింది.

## నల్లారి రీ ఎంట్రీకి.. అంతా సిద్ధం



తిరుపతి, జూన్ 25, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చిట్టచివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, విభజన అనంతరం రాజకీయంగా తెరమరుగై పోయారు. రాష్ట్ర విభజన తర్వాత 'జై సమైక్యాంధ్ర' పేరుతో కొత్త పార్టీ పెట్టారు. 2014 అసెంబ్లీ ఎన్నికలలో, చెప్పు గుర్తు, సమైక్యాంధ్ర నినాదంతో పోటీ చేశారు. అయితే, పార్లమెంట్ ఆమోదంతో, రాజ్యాంగ బద్దంగా రాష్ట్ర విభజన జరిగిన తర్వాత, సమైక్యాంధ్ర నినాదం ఇచ్చి ఏమి ప్రయోజనమని ప్రజలు, ఆయన గుర్తుతోనే ఆయనకు సమాధాన మిచ్చారు. రాజీనామా చేయవలసిన సమయంలో ముఖ్యమంత్రి పదవి పట్టుకు వేళ్లాడిన కిరణ్ కుమార్ రెడ్డి, చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు రాష్ట్ర విభజన జరిగిపోయిన తర్వాత బయటకు రావడాన్ని జనం జీర్ణించుకోలేక పోయారు. అందుకే ఆయన్ని పట్టిచుకోలేదు. ఆ ఎన్నికలలో కిరణ్ కుమార్ రెడ్డి ఘోరంగా ఓడి పోయారు.ఇక అక్కడ నుంచి ఆయన రాజకీయాలకు దూరంగా దాదాసే అజ్ఞాతవాసంలోకి వెళ్లి పోయారు. ఈ ఎనిమిదేళ్ళ కాలంలో అప్పుడో సారి .. ఇప్పుడో సారి ఒకరి రెండు సందర్భాలలో ఆయన పేరు రాజకీయ చర్చల్లో వినిపించినా, ఆయన మాత్రం ఎక్కడా క్రియాశీలంగా కనిపించలేదు. అయిన బీజేపీలో చేరుతున్నారని లేదు ఇంకేదో పార్టీలో చేరుతున్నారని రాజకీయ చర్చలో వినిపించినా, అలాంటిదేమీ జరగలేదు. అందుకే ఆయన రాజకీయ జీవితానికి తెర పడినట్లేనని విశ్లేషకులు భావిస్తూ వచ్చారు. మధ్యలో 2018లో రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు, అయినా ఆ తర్వాత కూడా ఆయన సైలెంట్‌గానే ఉండిపోయారు. అయితే, ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆయన్ని పిలిపించి పీసీసీ బాధ్యతలు చేపట్టమని అడిగినట్లు వార్తలొచ్చాయి. అయితే, అలాంటిదేమీ లేదని వ్యక్తిగత పనుల మీదనే ఢిల్లీ వచ్చిన్నట్లు కిరణ్ కుమార్ రెడ్డి మీడియాకు చెప్పారు. అయితే, ఆయన కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు.దీంతో, ఆయన మళ్ళీ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నారనీ, సోనియా గాంధీ ఆయనకు కీలక బాధ్యతలు ఆఫర్ చేశారనే చర్చ మొదలైంది. అదలా ఉంటే తాజాగా, ఆయన సొంత జిల్లా అన్నమయ్య ( చిత్తూరు) జిల్లాకు రావడంతో మళ్ళీ మరోమారు, నల్లారి వార్తల్లో కనిపించారు. నిజానికి ఆయన తమ స్వగ్రామం నగరిపల్లెలో కొన్న భూమి రిజిస్ట్రేషన్ పనుల నిమిత్తం అక్కడికి వెళ్ళారే కానీ రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనేందుకు వెళ్ళలేదు. భూమి కొనుగోలువ్యవహారం కాబట్టే, ఆయన వెంట కుమారుడు, నిఖిలేశ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు.అయితే, ఈసందర్భంగా ఆయనకు ఏపీసీసీ కార్యదర్శి అఘామోహిద్దీన్, జిల్లా కాంగ్రెస్ నేత శ్రీవర్ధన్, పలువురు నేతలు, కార్యకర్తలు అభిమానులు స్వాగతం పలికారు. అయన వారిని పలరించారు. ఇవన్నీ సహజంగా, ఏ నాయకుడు, (మాజీ అయినా) జరిగే తంతే, అందులోనూ మాజీ ముఖ్యమంత్రి అయినప్పుడు ఇంకొంచెం ఎక్కువగానే ఉంటుంది. నల్లారి విషయంలోనూ అదే జరిగింది. అయితే, ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో, 'త్వరలోనే మళ్లీ వస్తా.. అందరినీ కలుస్తా.. ఇకపై అందుబాటులోనే ఉంటా.. అప్పుడు అందరం కూర్చొని మాట్లాడుకుందాం..'అంటూ ఆయన పలికిన వీడ్కోలు పలుకులు, రాజకీయ వర్గాల్లో ఉహాగానాలకు తెర తీశాయిఆయన మళ్ళీ క్రియాశీల రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ అధిష్టానం ఆయనకు పీసీసీ పగ్గాలు అప్పగిస్తుందని, అందుకే ఆయన మళ్ళీ వస్తా .. మాట్లాడుకుందాం అన్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే నిజంగా, అయన రీ ఎంట్రీ ఇస్తారా ... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బతికిస్తారా? బతికించ గలరా? అంటే, ఆయన రీ ఎంట్రీ ఇస్తారా లేదా అనేది ఎలా ఉన్నా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బతికించడం మాత్రం, ఇప్పట్లో అయ్యేపని కాదని, అ మాట కొస్తే, కాంగ్రెస్సే కాదు బీజేపే సహా ఏ జాతీయ పార్టీకి ఇప్పట్లో ఏపీలోకి ఎంట్రీ చిక్కదని పరిశీలకులు భావిస్తున్నారు.

# కన్నా..బుట్ట సర్దేస్తున్నారా...

గుంటూరు, జూన్ 25, మాజీ మంత్రిగా, ఆంధ్రప్రదేశ్ బీజేపీ మాజీ అధ్యక్షుడిగా.. కాంగ్రెస్ పార్టీలో ఒకప్పుడు సీఎం రేసులో నిలబడిన కన్నా లక్ష్మీనారాయణ మౌనం కేడర్‌కు అర్థం కావడం లేదట. గతంలో ఆయన పెదకూరపాడు నుంచి నాలుగుసార్లు వరసగా గెలిచారు. రాజకీయ సమీకరణల్లో భాగంగా గుంటూరు పశ్చిమ ప్రాంతంతో అనుబంధం పెంచుకున్నారు. 2009లో అక్కడి నుంచి కూడా గెలిచారు కన్నా. మంత్రిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన 2014 రాష్ట్ర విభజన తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లో కొంత ఇబ్బంది పడ్డారు. వైసీపీ ఆహ్వానాన్ని కాదని.. బీజేపీలో చేరడం.. ఆ తర్వాత ఏపీ బీజేపీ చీఫ్ కావడం.. ఆయన నేతృత్వంలో 2019 ఎన్నికలకు వెళ్లడం చకచకా జరిగిపోయాయి. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా సోము వీర్రాజు పగ్గాలు చేపట్టిన తర్వాత కన్నా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న తరుణంలో కన్నా మౌనం కేడర్‌కు అంతుచిక్కడం లేదట.కొద్ది రోజులుగా కన్నా లక్ష్మీనారాయణను రాజ్యసభకు పంపుతారని.. అందుకే ఏపీ బీజేపీ చీఫ్ పదవి నుంచి తప్పించారని అనుచరులు ప్రచారం చేశారు. అయితే ఏపీలో బీజేపీ పరిస్థితి కారణంగా అది ఆలస్యమైనా.. ఎన్నికల లోపు ఖచ్చితంగా ఇస్తారని అనుకుంటున్నారట. మరి.. రాజ్యసభ సీటు ఇవ్వకపోతే కన్నా ఏం చేస్తారు అనేది ప్రశ్న. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేస్తారు? గెలిస్తే ఏంటి? గెలవకపోతే ఏం జరుగుతుంది అనే లెక్కలతో కేడర్ కుస్తీ పడుతోందట. పల్నాడు జిల్లా నుంచి కన్నా లక్ష్మీనారాయణ పోటీ చేస్తారని కొందరి వాదన. తనకు అచ్చి వచ్చిన పెదకూరపాడు నియోజకవర్గం ఉన్న లోక్‌సభ స్థానమైన నరసరావుపేట లేదా సత్తెనపల్లి అసెంబ్లీ నుంచి బరిలో ఉంటారని మరికొందరు చెబుతున్నారు. అయితే కాపు సామాజికవర్గం



ఓటర్లు ఎక్కువగా ఉన్న గుంటూరు పార్లమెంట్ నుంచి పోటీ చేయడానికి కూడా అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.ఏపీలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటి నుంచే యాక్టివ్ కావాలని అనుచరులు కన్నాకు సూచిస్తున్నారట. కూలింగ్ పిరియడ్ అయిపోయిందని.. సెగ్మెంట్ ఎంపిక చేసుకుని క్షేత్రస్థాయి నుంచి పని మొదలు పెట్టకపోతే ఇబ్బందులు ఎదురు కావొచ్చని హెచ్చరిస్తున్నారట. బీజేపీ నాయకత్వం రాజ్యసభ సీటు ఆఫర్ చేస్తే అప్పుడు చూద్దాం.. అప్పటి వరకు కామ్‌గా ఉండటం సరికాదన్నది కన్నా అంతర్గత సర్కిళ్లతో వినిపిస్తున్న మాట. గతంలో సీఎం పదవి వరకూ కన్నా పేరు చర్చల్లోకి వెళ్లిందని.. అలాంటి నాయకుడు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి సత్తా చాటకపోతే ఇమేజ్ కూడా ప్రమాదంలో పడుతుందని అనుచరులు ఆందోళన చెందుతున్నారట.అభిమానులు, అనుచరులు చెప్పింది

# గుడివాడ నుంచే టీడీపీ మొదలు

విజయవాడ, జూన్ 25, తెలుగు దేశం అధినేత చంద్రబాబు నాయుడు ముందుగా గుడివాడ పై దృష్టిసారించారు. గుడివాడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొడాలి నానికి చెక్ పెట్టాలన్న లక్ష్యంతో తెలుగుదేశం అధినేత చంద్ర బాబు స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. ఈ మేరకు ఆ పార్టీ వర్గాలు సన్నద్ధమవుతున్నాయి. నాలుగు పర్యాయాలు గుడివాడ నుంచి గెలిచిన కొడాలి నాని ఇప్పటికీ తన వ్యవహార తీరును మార్చుకోలేదు. ప్రజలు ఆయన్ను అసహ్యించుకుంటున్నారు. ఇలాంటి వారిని మరోసారి గెలవనీయకుండా చూడాలని తెలుగుదేశం అధినేత పట్టుదలతో వున్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శతజయంతి సంద ర్భంగా ఆయన జన్మించిన ప్రాంతం గుడివాడలో భారీ బహిరంగ సభ నిర్వహించి, తద్వారా కొడాలి నాని, వైసీపీ ఆగడాలకు, దూకుడుకు చెక్ పెట్టేందుకు టీడీపీ అగ్రనేతలు కత్తులు దూస్తున్నారని సమాచారం.అవసరం ఉన్నా లేకపోయినా టీడీపీని, మరీ ముఖ్యంగా ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు నారా లోకేష్ పై నోరేసుకుని పడిపోయి, బూతులతో విమర్శలు చేసే కొడాలి నాని అంటే టీడీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నాయి. మంత్రి పదవి నుంచి తనను జగన్ రెడ్డి పీకి పారేసినా కూడా కొడాలి తన బూతు పంచాంగాన్ని ఆపడం లేదు. నాలుగుసార్లు ఓట్లు వేసి గెలిపించి అసెంబ్లీకి పంపించిన గుడివాడ నియోజకవర్గం ప్రజలకు ఆయన చేసిందేమీ లేదు. నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం. రోడ్ల దుస్థితి చెప్పక్కర్లేదు. రోజూ అనేక స్థానిక, అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు నడిచే గుడివాడ బస్టాండ్ దుస్థితి కొడాలి నాని పనితీరుకు ప్రత్యక్ష నిలువెత్తు నిదర్శనం.గురివింద గింజ తన



నలుపు సంగతి ఎరుగదు అన్న చందంగా కొడాలి నాని తీరు ఉందనే విమర్శలు సర్వత్రా వస్తున్నాయి. గుడివాడ నియోజకవర్గంలో ఎన్నో సమస్యలున్నా పట్టించుకోకుండా పేకాటలు, భూ ఆక్రమణలు, క్యాసినోల నిర్వహణలో తలమునకలయ్యే కొడాలి నాని చంద్రబాబు పైనా, లోకేష్ పైనా నిత్యం అసందర్భ, అనుచిత ప్రేలాపనలతో కాలక్షేపం చేస్తుండడాన్ని నియోజకవర్గం ప్రజలు మొత్తం గమనిస్తూనే ఉన్నారు. ఆ విధంగా విరుచుకుపడటం తనకు, తన పార్టీకే నష్టమన్న ఇంగితం కూడా లేకపోవడం విడ్డూరం. కొడాలి నానిని, టీడీపీ వ్యవస్థాపకుడి సొంత నియోజకవర్గం గుడివాడను ఇలాగే వదిలేస్తే మంచిది కాదని టీడీపీ అధిష్టానం భావిస్తోంది. ఈ నెల 29న కృష్ణా జిల్లా మహానాడులో భాగంగా గుడివాడలో లక్ష మందితో భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహించాలని టీడీపీ అధిష్టానం నిర్ణయించింది. గుడివాడ సభకు భారీ ఎత్తున జనసమీకరణ చేసేందుకు టీడీపీ నేతలు నడుం బిగించారు. గుడివాడ సభను గ్రాండ్ సక్సెస్ చేయడం ద్వారా నియోజకవర్గంలో పట్టు నిలబెట్టుకోవాలని, బూతుల నేతకు మూతి వాచేలా చెక్ చెప్పా లనే లక్ష్యంతో టీడీపీ నేతలు, శ్రేణులు సిద్ధం అవుతున్నారు.గుడివాడ నియోజకవర్గానికి సంబంధించి మాజీ ఎమ్మెల్యే, గుడివాడ టీడీపీ ఇన్ చార్జి రావి వెంకటేశ్వర రావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ చంద్రబాబు బహిరంగ సభను దిగ్విజయం చేసేందుకు పూర్తిస్థాయిలో రంగంలో దిగారు. కేసినో వ్యవహారంలో టీడీపీ నిజనిర్ధారణ కమిటీ గుడివాడలో పర్యటించి నప్పుడు స్థానిక టీడీపీ నేతలను గుడివాడ నాని అండ్ కో భయపెట్టి.. బయటకు రాకుండా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గుడివాడలో బహిరంగ సభను విజయవంతం చేసేందుకు టీడీపీ అధిష్టానం నేరుగా రంగంలో దిగడం విశేషం. గుడివాడలో బహిరంగ సభ ఎక్కడ నిర్వహించాలనే దానిపై మాజీ మంత్రి కొల్లు రవీంద్ర స్థానక నేతలతో ఇప్పటికే చర్చలు జరిపారు. భారీ బహిరంగ సభకు అనుకూలంగా ఉండే స్థలా ల్ని కూడా ఆయన పరిశీలించారు. టీడీపీ ఏపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు కూడా గుడివాడ నేతలతో సమావేశం నిర్వహించారు. జనసమీకరణను సవాల్ గా తీసుకోవాలని వారికి అచ్చెన్నాయుడు పిలుపు ఇచ్చారు.చంద్రబాబు నాయుడు జిల్లాల పర్యటనలో భాగంగా ఈ నెల 29 సాయంత్రం గుడివాడలో మహానాడు, బహిరంగసభ నిర్వహిస్తారు. ఆ రోజు రాత్రి ఎన్టీఆర్ పుట్టిన ఊరు నిమ్మకూరులో బస చేస్తారు. 30వ తేదీ ఉదయం బందరు పార్లమెంటరీ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను సక్సెస్ చేయాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. 'బాదుడే .. బాదుడు' అంటూ చంద్రబాబు చేస్తున్న ఏపీ వ్యాప్త పర్యటనలకు జనం నుంచి భారీ స్పందన వస్తోంది.

## ఫ్యాన్ రెక్కలు... విరిగిపోతున్నాయా...

విశాఖపట్టణం, జూన్ 25, ఈ మధ్య ఏపీలో ఎక్కడ చూసిన వైసీపీ ఎమ్మెల్యేలని ప్రజలు నిలదీస్తున్న సన్నివేశాలే కనిపిస్తున్నాయి. తమ సమస్యలని పరిష్కరించాలని చెప్పి ప్రజలు?ఎక్కడకక్కడ వైసీపీ ప్రజాప్రతినిధులని ప్రశ్నిస్తున్నారు. గత మూడేళ్లుగా ప్రజల్లో పెద్దగా తిరగని ఎమ్మెల్యేలు?జగన్ దెబ్బకు ఒక్కసారిగా ప్రజల్లోకి వచ్చారు. ఎమ్మెల్యేలు గడప గడపకు వెళ్లాలని జగన్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అలాగే ప్రజల్లో బలం ఉన్నవారికే నెక్ట్స్ సీట్లు కూడా ఇస్తానని చెప్పారు.దీంతో ఎమ్మెల్యేలంతా ప్రజల్లో తిరగడం మొదలుపెట్టారు. అయితే మూడేళ్లుగా కనిపించని ఎమ్మెల్యేలు ఒక్కసారిగా కనిపించేసరికి ప్రజలు తమ సమస్యలని ఏకరువు పెడుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేలని నిలదీస్తున్నారు?పథకాలు అందడం లేదని, అభివృద్ధి జరగడం లేదని, అలాగే పన్నుల భారం పెంచడంపై ప్రజలు, ఎమ్మెల్యేలపై తిరగబడే పరిస్తితి. మరి ప్రజలు నిలదీస్తున్నప్పుడు ఓపికగా సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉంటుంది..అలాగే తప్పులు జరగకుండా చూసుకుంటామని, తాము అండగా ఉంటామని భరసా ఇవ్వాలి.మరి వైసీపీ ప్రజా ప్రతినిధులు అలాగే చేస్తున్నారా? అంటే అబ్బే లేదనే చెప్పాలి..ప్రజలు నిలదీస్తున్నారని చెప్పి. ఎమ్మెల్యేలే ప్రజలపై తిరగబడే పరిస్తితి కనిపిస్తోంది. ప్రశ్నిస్తున్న వారిపై ఎమ్మెల్యేలు ఫైర్ అయిపోతున్నారు?పైగా పరుష పదజాలంతో తిడుతున్నారు?పోలీసులతో కేసులు కూడా పెట్టిస్తున్నారు. తాజాగా విజయవాడ వెస్ట్ లో పర్యటించిన ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ ని ఓ యువకుడు ప్రశ్నించాడు?.మీరు 1500 కోట్లు అవినీతి చేశారని ఆరోపణలు వస్తున్నాయని చెప్పుకొచ్చాడు..దీనికి సరైన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉంటుంది. అలా కాకుండా యువకుడుపై కేసు పెట్టి విచారించాలని ఎమ్మెల్యే?పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. అంటే ప్రశ్నిస్తే కేసులు పెడతాం..లేదంటే తిడతాం?అది కాదంటే ప్రశ్నించిన వాళ్ళు టీడీపీ వాళ్ళు అని చెప్పి ముద్రవేస్తాం అన్నట్లుగా వైసీపీ ఎమ్మెల్యేల తీరు ఉంది. ఇక ఇలాగే ముందుకెళితే వైసీపీకి ప్లస్ కంటే మైనస్సే ఎక్కువ అయ్యేలా ఉంది. కాబట్టి జగన్ మళ్ళీ గెలవాలంటే వైసీపీ ఎమ్మెల్యేల పనితీరు మారాలని చెప్పొచ్చు.

## మోటారు సైకిల్ దొంగలను అరెస్ట్ చేసిన 3వ పట్టణ పోలీసులు

రాజమహేంద్రవరం రాజమహేంద్రవరం లో జిల్లా ఎస్పి ఐశ్వర్య రస్తోగి పర్యవేక్ష్యనలో సెంట్రల్ జోన్ డిఎస్పీ సంతోష్ అధ్వర్యంలో రాజమహేంద్రవరం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నెంబర్ 326/ 2022 యు/ఎస్ 379 ఐ.పి.సి, చల్లా భాస్కరరావు ఇచ్చిన పిర్యాదుపై కేసు నమోదు చేసి, సదరు దొంగలించబడిన సొత్తు గురించి దర్యాప్తు చేయగా పెంటకోట రామకృష్ణ, తల్లా రామలింగయ్య,భూపతి అనిల్ కుమార్అను ముగ్గురు ముద్దాయిలగా గుర్తించి సదరు పరారు ముద్దాయిల గురించి పక్కా సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి మధుబాబు మరియు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్యామ్ సుందర్ మరియు క్రైమ్ సిబ్బంది ఆధ్వర్యంలో ముద్దాయిలను ఈ నెల 24 వ తేదీ మధ్యాహ్నం సుమారు 12గంటలకు, స్థానిక కోరుకొండరోడ్ లో మార్కెట్ యార్డ్ వద్ద వారి ముగ్గురు ని అరెస్టు చేసి వారి నుండి దొంగలించబడిన ఐదు మోటార్ సైకిళ్లను బజాజ్ పల్సర్,హోండా యూనికాన్ రెండు హోండా షైన్,హోండా యాక్టివా,రికవరీ చేసి ముద్దాయిలను రిమాండ్ నిమిత్తం, రాజమహేంద్రవరం ఐదు వ కోర్ట్ మేజిస్ట్రేట్ ముందు శుక్రవారం హాజరుపరచి రిమాండ్ కి తరలిచామని సి.ఐ మధుబాబు పత్రిక ప్రకటనలో వెల్లడించారు.

## టీడీపీ కార్యకర్తలతో మాగంటి బాబు భేటీ

### టీడీపీని అధికారంలోకి తీసుకురావాలి

ఏలూరు నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏలూరు మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు(బాబు) పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. అయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నుండి ఎన్ని కష్టాలు ఎదురైనా, కేసులు పెట్టిన మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడిని గెలిపించాలి.జగన్మోహన్ రెడ్డి ఒక్కసారి అవకాశం ఇవ్వాలంటూ ప్రజలను అభ్యర్థించి అన్ని విధాలుగా రాష్ట్ర ప్రజలను రాష్ట్రాని సైతం ముంచి వేసాడు. తెలుగుదేశం పార్టీ నుండి వైసీపీలోకి వెళ్లిన కొడాలి నాని, వంశీమోహన్ లు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన కుటుంబాన్ని గూర్చి అసభ్యకరంగా వ్యాఖ్యానించడం దారుణమని అయన అన్నారు. నూజివీడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో ఉన్న విభేదాలను, నాయకుల మధ్య తొలగించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఫేస్బుక్, వాట్సాప్ లో వ్యాఖ్యలు చేసుకోవడం మానకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసిపి నాయకులు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెలుగుదేశం పార్టీని, నాయకులను టార్గెట్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతున్నారు, మాకు పౌరుషాలు ఉన్నాయి, మేము మాట్లాడగలం, వారి కంటే ఎక్కువ బూతులు తిట్టగలమని అన్నారు. పదవులు శాశ్వతం కాదు, ప్రజలకు సేవ చేయడమే మా కుటుంబ వంశ పారంపర్యంగా వస్తున్న ఆచారం, దాన్ని నిలబెట్టుకునేందుకు ప్రజల కోసమే పని చేస్తాను. 2023 లో కానీ, 2024లో కానీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు కీలకం కానున్నాయని, కేంద్ర ప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్రాల్లో కూడా మన రాష్ట్రం గురించి చర్చ జరుగుతుందని అన్నారు. తెలుగుదేశం పార్టీకి రాష్ట్రంలో ఓటు బ్యాంకు అలాగే ఉందని, కారణాల వలన ప్రస్తుతం టిడిపి ఓటమిపాలైనప్పటికీ రానున్న ఎన్నికల్లో గెలుపు తెలుగుదేశం పార్టీదే. సర్పంచులు ఎంపీటీసీల ఎన్నికల్లో నూజివీడు నియోజకవర్గంలో అత్యధికంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలుపొందారని అన్నారు.

అన్ని సర్వేలు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తోందని చెబుతున్నాయని దానికి తగ్గట్లుగా పార్టీ నాయకులు కార్యకర్తలు విభేదాలు వీడి, అభ్యర్థుల కోసం పనిచేసి గెలిపించాలి. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కి ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పుణ్యమా అంటూ మూడేళ్లలోనే ఎక్కడలేని అభిమానం పెరిగిందని మాగంటి బాబు అన్నారు.క్రమశిక్షణగల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసమే పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలంటే, అది మన నూజివీడు నియోజకవర్గం నుండే ముద్దరబోయిన వెంకటేశ్వరరావును శాసనసభ్యులుగా గెలిపించి నాంది పలకాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, నూజివీడు పట్టణ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్, ముసునూరు రాజబాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరు దుర్గాప్రసాద్, రజక వర్గ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పవన్ పార్టీలోకి మరో ఐఏఎస్ అధికారి

రాజమండ్రి, జూన్ 25,చ్చే ఎన్నికలకు సంబంధించి ఇప్పటి నుంచే తర్జనభర్జనలు నడుస్తున్నాయి. ఓ విధంగా ఎవరు గెలుస్తారు ఎవరు ఓడిపోతారు అన్న విషయమై కాకుండా ఎవరు పోటీ చేస్తారు అన్న విషయమై ఇప్పటి నుంచే కొన్ని ప్రతిపాదనలు వస్తున్నాయి. రాజకీయం అన్నాక ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలు రాసుకోవాలి కనుక జగన్ పార్టీలో కానీ జనసేన పార్టీలో కానీ కొత్త ముఖాలు సందడి చేస్తూనే ఉంటున్నాయి ఎప్పటికప్పుడు ! ఆ క్రమంలో కొత్తగా మాజీ ఐఏఎస్ అధికారి ఒకరు జనసేన గూటికి చేరుకున్నారు. ఆయన ప్రభావం పార్టీపై ఏ విధంగా ఉండనుంది అన్నదే ఆసక్తిదాయకం.జనసేనాని పవన్ గూటికి మరో విశ్రాంత ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్ (స్వస్థలం : రాజోలు నియోజకవర్గం, దిండి (గ్రామం) చేరారు. దీంతో ఆ పార్టీలో మరో చర్చ మొదలవుతోంది. వచ్చే ఎన్నికల్లో రాజోలు నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థి ఆయనేనా ? అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే ఇక్కడ పోటీ చేసి గెలిచిన రాపాక వరప్రసాదరావు (జనసేన టికెట్ పొందారు గత ఎన్నికల్లో ఈయన) పార్టీని కాదని వెళ్లిపోయారు. దీంతో పవన్ అభిమానులు ఎంతో నిరాశకు గురయ్యారు.వైసీపీ వర్గాలకు చేరువగా ఉంటూ ఇప్పుడు రాజకీయం చేసుకుంటున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో మళ్లీ మరోసారీ రాజోలు నియోజకవర్గం విషయం వార్తల్లోకి వచ్చింది.వాస్తవానికి గత ఎన్నికల్లో పవన్-తో పాటే ఉంటూ, ఆయన పార్టీ తరఫున విశాఖ ఎంపీ స్థానానికి సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ పోటీ చేశారు. అయితే ఆయన ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. తరువాత ఆయన పార్టీ నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు ఈయన కూడా వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలున్నాయి అని తెలుస్తోంది. ఈయన్ను నెత్తిన పెట్టుకుంటే రాపాక మాదిరిపార్టీకి హ్యాండ్ ఇచ్చి వెళ్లరని ఏంటి గ్యారంటీ అన్న అనుమానాలూ వస్తున్నాయి. రాపాక వర ప్రసాదరావు మాదిరి అంతా ఆ విధంగా రాజకీయం చేస్తారని అనుకోవద్దని, పార్టీని నమ్ముకుని పనిచేసేవాళ్లు ఇప్పటికీ ఉన్నారని కనుక ఇటువంటి అధికారులనుమేలు చేసే విధంగా పార్టీ పటిష్టతకు ఉపయోగపడేవిధంగా వాడుకోవాలని ఇంకొందరు సూచిస్తున్నారు.

## కొల్లాపూర్ నియోజకవర్గం టీఆర్ఎస్ లో భగ్గుమంటున్న వర్గ విభేదాలు

నాగర్ కర్నూల్ జూన్ 25నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో అధికార టీఆర్ఎస్ పార్టీలో తాజా మాజీ ఎమ్మెల్యేల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. 2018 ఎన్నికల్లో ఇక్కడ నుంచి టీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్దన్ రెడ్డి చేతిలో ఓటమి చవిచూశారు. ఆ తర్వాత టీఆర్ఎస్ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ లో భాగంగా హర్షవర్ధన్ రెడ్డి టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో అప్పటి నుంచి అటు జూపల్లి కృష్ణారావు బీరం హర్షవర్దన్ రెడ్డిల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందనే చర్చ నియోజకవర్గంలో జరుగుతోంది.సహజంగానే హర్షవర్దన్ రెడ్డి టీఆర్ఎస్ లో చేరడంతో నియోజకవర్గంలో పెత్తనమంతా ఆయన కనుసన్నల్లో నడుస్తోందని చెప్పుకుంటున్నారు. చివరకు అధికారులు సైతం ఆయన చెప్పినట్టే నడుచుకుంటున్నారని అంటున్నారు. గతంలో మంత్రిగా చక్రం తిప్పిన జూపల్లి ఎన్నికల్లో ఓటమితో ఆయన హవా తగ్గింది. పార్టీ అధిష్టానం కూడా పట్టించుకోకపోవడంతో ఆయన స్తబ్దుగా మారిపోయారని చెప్పుకుంటున్నారు.ఈ నేపథ్యంలో అటు మాజీ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు ఇటు ఎమ్మెల్యే బీరం హర్షవర్దన్ రెడ్డి మధ్య సవాళ్లు ప్రతి సవాళ్లు చోటు చేసుకుంటున్నాయి. నువ్వెంత అవినీతిపరుడవో.. నేనెంత అవినీతిపరుడనో తేల్చుకుందాం.. రా అని జూపల్లి కృష్ణారావు.. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి సవాల్ విసిరారు. దీనికి బీరం కూడా సై అనడంతో కొల్లాపూర్ టీఆర్ఎస్ లో విభేదాలు భగ్గుమన్నాయి.ఇద్దరి నేతల అవినీతిపై చర్చకు జూన్ 26న కొల్లాపూర్ పట్టణంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసుకున్నారు. ఇదే క్రమంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తన ఇంటి నుండి భారీ ర్యాలీతో మాజీ మంత్రి జూపల్లి ఇంటి వరకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. ప్రజలు పాత్రికేయుల సమక్షంలో చర్చించడానికి అనుమతి కావాలని ఎమ్మెల్యే అనుచరుడు జంబులయ్యా ఎస్పీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు.ఈ నేపథ్యంలో ఇద్దరు నేతల సవాళ్లు ప్రతి సవాళ్లపై పూర్తిస్థాయిలో వివరాలను తప్పించుకున్న జిల్లా ఎస్పీ మనోహర్ పోటాపోటీగా సమావేశాలు నిర్వహించుకోవడం వల్ల శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని చర్చకు అనుమతి నిరాకరించారు.జూన్ 26న కొల్లాపూర్ పట్టణంలో ప్రజలు గుంపులు గుంపులుగా ఉండడం గానీ సభలు సమావేశాలు నిర్వహించడం గానీ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లభించక పోవడంతో కొల్లాపూర్ అధికార పార్టీ నేతల కొట్లాటకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లేనని భావిస్తున్నారు.

## స్పందన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత

రాజమహేంద్రవరం స్పందన ఫిర్యాదులలో ఏ ఏ కేటగిరిలో ఏ శాఖకు చెంది పరిష్కారం కానీ ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యత ను ఇచ్చి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టరేట్ డా. కె. మాధవీలత పేర్కొన్నారు.శనివారం ఉదయం సంబంధిత శాఖల కార్యదర్శులు, అన్ని జిల్లాల కలెక్టర్లతో గ్రామ మౌలిక సదుపాయాల పనులపై, ఇతర ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై వర్చువల్ మీటింగ్× ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అమరావతి నుంచి సమీక్షించారు. జిల్లా కలెక్టరెట్ నుంచి జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ తో కలిసి కలెక్టర్ మాధవీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. మాధవీలత సమావేశ వివరాలు పేర్కొంటూ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలు అమలు లో అధికారులు నిబద్దత తో పనిచేసి లక్ష్యాలను సాధించాలన్నారు. స్పందనలో పరిష్కరించిన ఫిర్యాదులను అధ్యాయనం చేసి నివేదిక రూపొందించి, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఎక్కువగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన ఫిర్యాదులు వస్తున్న దృష్ట్యా వాటిపై కూడా అధ్యాయనం చెయ్యాల్సి ఉంటుందని తెలిపారు. పేదలందరికీ ఇళ్ళు , నాడు నేడు, అర్భికెలు, హెల్త్ క్లినిక్స్, తదితర భవన నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు.



ప్రతి ఒక్క పనికి సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలన్నారు. భవన నిర్మాణానికి సంబంధించిన ముడి సరుకులకు ఆయా లే అవుట్ లలో సిద్ధం గా ఉంచాలన్నారు.

## పాయకరావుపేటలో ఇద్దరు ఘరానా బైక్ దొంగలు అరెస్ట్

### 24 మోటారు సైకిళ్ళు స్వాధీనం

పాయకరావుపేట అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఇద్దరు బైక్ దొంగలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు నర్సీపట్నం ఏఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు.ఈ నెల 20 న నాతవరం కు చెందిన యువకుడు తన బైక్ పోయిందంటూ ఇచ్చిన పిర్యాదుపై విచారిస్తున్న పోలీసులకు పాయకరావుపేట మండలంలోని అరట్లకోట గ్రామ సమీపంలో బుల్లెట్ వాహనంతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా 24 ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లు ఒప్పుకున్నారన్నారు. విశాఖ నగర పరిధిలోని గాజువాక, స్టీల్ ప్లాంట్ , దువ్వాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో 11 బైకులు దొంగలించారు. అలాగే అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, రాజమండ్రి , కోనసీమ జిల్లాల పోలీస్ స్టేషన్ల పరిధిలో మరో 13 బైకులను దొంగిలించారని ఎఎస్పీ తెలిపారు. గాజువాక పట్టణంలోని చినగంట్యాడకు చెందిన యు.రాజేష్ బాబు,కోనసీమ జిల్లా అమలాపురంకు చెందిన యు.నాగరాజులను అరెస్ట్ చేసి వారి వద్దనుంచి 24 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు.

## కాటారి హేమలత ఘటనపై ఎస్పీ స్పందన

చిత్తూరుచిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలత గాయపడ్డ ఘటనపై జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి స్పందించారు. కటారి హేమలత అనుచరుడు పూర్ణను అరెస్టు చేసే సమయంలో పోలీసులు, కటారి వర్గీయులకు మధ్య తోపులాట జరిగింది.గంజాయి కలిగి ఉన్నాడన్న పక్కా సమాచారంతోనే పూర్ణను అరెస్టు చేసేందుకు పోలీసులు వెళ్లారు. ఆ సమయంలో కటారి కుటుంబ సభ్యులు పోలీసులను అడ్డుకోడానికి ప్రయత్నించారు. నిందితుడు పూర్ణను కాపాడేందుకు వారు పోలీసు విధులకు ఆటంకం కలిగించి గొడవకు దిగారు. ఈ క్రమంలోనే మాజీ మేయర్ కటారి హేమలత కింద పడి స్వల్పంగా గాయపడ్డారు. పోలీసు వాహనం కూడా డ్యామేజ్ అయ్యింది. కావాలని హేమలతపై పోలీసులు వాహనాన్ని ఎక్కించలేదు. పోలీసులు వాహనాన్ని ఎక్కించి హత్యాయత్నానికి పాల్పడ్డారన్నది అవాస్తవం. మేయర్ దంపతుల హత్య కేసులో సాక్షులకు రక్షణ కల్పిస్తాం. ఏఎస్పీ స్థాయి అధికారిని నియమించి ఈ ఘటనపై విచారణ జరిపిస్తాం. ఈ ఘటనలో రెండు కేసులు నమోదు చేశాం. గంజాయి కేసు నమోదు ఒకటి. పోలీసు విధులకు ఆటంకం కల్పించడంపై మరో కేసు నమోదు చేశామని ఎస్పీ రిశాంత్ రెడ్డి వివరించారు.

## మాదకద్రవ్యల వ్యతిరేక దినోత్సవం

విశాఖపట్నం నేటి తరం మత్తుపదార్దాల బారిన పడకుండా ఉండేలా ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.యువత మెదస్సును చిత్తు చేస్తున్న డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండేలా వారిలో చైతన్యాన్ని నింపుతూ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం అవగాహన సదస్సు ప్రత్యేక కార్యక్రమాన్ని విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వై వి ఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించారు.ఈ సదస్సులో వైస్ ఛాన్సలర్ ప్రసాద్ రెడ్డి , జిల్లా జడ్జి హరి హరనాధ శర్మ పాల్గోన్నారు.జిల్లా జడ్జ్ హారనాధ్ శర్మ మట్లాడుతూ యువత మత్తు పదార్థాలను పూర్తిగా వ్యతిరేకించాలని సూచించారు.జీవితంలో ఉన్నత స్దాయికి వెళ్లేందుకు నిర్ధష్టమైన లక్షాలతో ముందుకు సాగాలని కోరారు

## నరసాపురంలో వైకాపా ప్లీనరీ

నరసాపురం పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం పట్టణంలోని అల్లూరి ఫంక్షన్ హాల్ లో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధ్యక్షతన నియోజవర్గ స్థాయి ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, తానేటి వనిత, దాడిశెట్టి రాజా మాజీ మంత్రి పేర్ని నాని జిల్లా పరిషత్ చైర్మన్ కౌరు శ్రీనివాస్ పలువురు ఎమ్మెల్యేలు భారీగా వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రతిపక్షం ఘాటైన విమర్శలు చేశారు.భయం అన్నది నారా వారి బయోడేటా లో లేదు అన్న నారా లోకేష్ వ్యాఖ్యలను అందించారు.నారా లోకేష్ కు దమ్ముంటే తెలంగాణ లో బాదుడే బాదుడు కార్యక్రమం చెయ్యాలని సవాల్ చేశారు.ఓటుకు నోటు కేసులో చంద్రబాబు దొరికిపోయి భయం తో రాత్రికి రాత్రి పారిపోయి వచ్చి బస్సులో పడుకున్నాడు అన్నారు.జగన్ దెబ్బకు కుప్పంలో ఎప్పుడూ లేని విధంగా చంద్రబాబు ఎక్కువ రోజులు తిరిగేలా చేశారని మంత్రి కారుమూరి నాగేశ్వరావు అన్నారు.

## లారీ, కారు ఢీ?ట్రాఫిక్ జాం

కడప కడప ఒంటిమిట్ట చెరువు కట్టపై శనివారం ఉదయం 6 గంటలకు కారును లారీ ఢీకొంది. ఘటనలో లారీ చెరువు కట్ట పై అడ్డంగా పడిపోయిది. దాంతో ట్రాఫిక్ జామ్ ఎర్పడింది. పోలీసులు రాజంపేట కడప వెళ్లే వాహనాలను ఒంటిమిట్ట కొత్తపల్లి గంగా పేరూరు, ఇబ్రహీంపేట, సాలా బాదు, మీదుగా దారి మళ్లించారు. ఈ ఘటనలో హైదరాబాద్ నుండి తిరుపతికి కారులో వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని 108లో కడప రిమ్స్ కు తరలించారు. చెరువుకొట్టపై రహదారి కి గడ్డంగా పడిన లారీని పక్కకు తొలగించేందుకు పోలీసులు తీవ్రంగా కృషి చేసారు..

# ఉమ్మడి జిల్లాలో వైసిపి జెండా విజయబావుటా ఎగరేద్దాం

-: కాటసాని రాంభూపాల్ రెడ్డి





కర్నూలు జూన్ 25 -: అట్టహాసంగా పాణ్యం నియేజకవర్గ ప్లీనరీ సమావేశం? కష్టపడిన కార్యకర్తలకు కీలక స్థానాల్లో స్థానం కల్పిస్తామన్నా కాటసాని ? మూడేళ్ల ప్రగతి ప్రజల్లోకి తీసుకెళ్తూ ఎన్నికలకు సమాయత్తం కావాలి? కర్నూలు నగరం ప్రగతి పథంలో నడుస్తుందన్న మేయర్? నూతన ఉత్తేజంతో రానున్న ఎన్నికలకు సిద్ధం కావలన్నా జెడ్పీ చైర్మన్? సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరిన కాటసాని శివ నరసింహ రెడ్డి?హాజరైన నియేజకవర్గ స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ కమిటీ, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు.../ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా విజయబావుటా ఎగరవేద్దామని నంద్యాల జిల్లా వైయస్ఆర్ సిపి జిల్లా అధ్యక్షులు ఉ పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.శనివారం కర్నూలు నగర శివార్లలోని కే.యస్.ఆర్. ఫంక్షన్ హాలులో పాణ్యం నియేజకవర్గ స్థాయి ప్లీనరీ సమావేశం నిర్వహించారు...ఈ సమావేశానికి కర్నూలు నగర మేయర్ బి.వై. రామయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ ఉ ప్లీనరి పరిశీలకులు ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే తనయుడు ఉ పాణ్యం యువనేత కాటసాని శివనరసింహా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు...ముందుగా ప్రార్థన గీతం, జెండా ఆవిష్కరణ,జ్యోతి ప్రజ్వలన తర్వాత దివంగత మహానేత,మాజీ ముఖ్యమంత్రి డా.వై.యస్. రాజశేఖరరెడ్డి గారి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పి, స్థాయీ సంఘం సభ్యులు గాజుల శ్వేత రెడ్డి, ఓర్వకల్లు సర్పంచ్ తోట అనుష ల అధ్యక్షతన సమావేశాన్ని ప్రారంభించారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు రానున్న పార్టీ పదవుల్లో కీలక స్థానాలను ఇస్తామని, రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.పాణ్యం నియోజకవర్గంలో ప్రపంచంలో మొట్టమొదటి సారి పెద్ద ప్రాజెక్టు గ్రీన్ కో వచ్చిందని, దానికి తోడు ఎయిర్ పోర్ట్, పరిశ్రమలు పెద్ద ఎత్తున తరలి వస్తున్నాయన్నారు.జిల్లాలో పార్టీకి ఢోకా లేదని, ప్రభుత్వం చేపట్టిన పనుల గురించి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళడం ద్వారా ప్రతిపక్షాల డిపాజిట్లు గల్లంతు చేయవచ్చన్నారు...మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం మరియు అభివృద్ధి రెండు కళ్ళుగా భావిస్తుందని, ప్రతి వార్డులో అదనంగా పది మంది ఉద్యోగులను తీసుకుని వచ్చి అటు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, మరోవైపు యువతకు ఉపాధి కల్పిస్తుందన్నారు.దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కొన్ని వేల కోట్లు ప్రజల సంక్షేమానికి ఇస్తున్నట్లు పేర్కొన్నారు.అలాగే కర్నూలు నగరాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నామని, దీనిని పార్టీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు ప్రజల్లో తీసుకెళ్ళాలని కోరారు...జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ నూతన ఉత్తేజంతో కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడాల్సిన సమయం వచ్చిందని, గత మూడేళ్లుగా సాగిన జనరంజక పాలనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళాలన్నారు.గ్రామల్లో రైతులకు, మహిళలకు, యువతకు మంచి అవకాశాలు కల్పించి నూతన శకానికి నాంది రాష్ట్ర ప్రభుత్వం పలికిందన్నారు...యువనేత కాటసాని శివనరసింహా రెడ్డి మాట్లాడుతూ...సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించేలా అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని, త్వరలో నియోజకవర్గంలో కార్యకర్తలు,నాయకుల ఇంటికి స్వయంగా నేనే వస్తానన్నారు.స్థానిక నాయకులకు కాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకులకు ప్రాధాన్యం ఎప్పుడూ ఉండబోదన్నారు...ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక,కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మిాదివేముల ప్రభాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, కార్పొరేషన్స్ డైరెక్టర్లు ఎన్.గోపాల్ రెడ్డి, జి.విద్యాసాగర్, పి. తులసి, కరుణాకర్, వెంకటసాయి, అనంతలక్ష్మి, జెడ్పిటీసిలు ప్రభాకర్ రెడ్డి, రంగనాథ్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, సరళమ్మ, ఎంపిపిలు శారద, తిప్పన్న, నాగ మాదమ్మ, హుసేన్ బి,ఓర్వకల్ సర్పంచ్ తోట అనూష, స్టాండింగ్ కమిటీ మెంబర్ గాజుల శ్వేతారెడ్డి,కార్పొరేటర్లు...మైతాపు చిన్న నర్సింహులు, ఏ.నాగ లక్షిరెడ్డి, వైజా అరుణ, లక్ష్మీకాంత రెడ్డి,పల్లె శారద, నారాయణ రెడ్డి, సుదర్శన్ రెడ్డి,కాశపోగు జయరాముడు,మిద్దె చిట్టెమ్మ, సాన శ్రీనివాసులు, ఎరుకల వెంకటేశ్వర్లు,సాపురు మాధురి, ఆయిషా ఇంకా పలువురు నియోజకవర్గ పరిధిలోని సర్పంచులు,ఎంపీటీసీలు,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపై వేసిన భారాలు తగ్గించాలి



## స్థానిక సమస్యలను పరిష్కరించాలని సచివాలయాల ఎదుట ధర్నా

కర్నూలు జూన్ 25 -: సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా 23 వ వార్డు శ్రీరామనగర్,36.37 వ వార్డు లు వీకర్ సెక్షన్ కాలనీ,32 వ వార్డు ముజఫర్ నగర్ 24 వ వార్డు లక్ష్మీ నగర్ 39 వ వార్డు మమతానగర్ వార్డు సచివాలయం ల దగ్గర సిపిఎం పార్టీ వార్డు కమిటీ ల ఆధ్వర్యంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని,పెట్రోలు,డీజిల్,గ్యాస్, కరెంటు చార్జీలు, ఆర్టీసీ ఇంటి పన్ను, ధరలు తగ్గించాలని,చెత్త పన్ను ను రద్దు చేయాలని, డ్రైనేజీ సమస్యను,రోడ్ల సమస్యను పరిష్కరించాలని, నుద్ద వాగు కు రక్షణ గోడ నిర్మించాలని,త్రాగునీటిసమస్యను పరిష్కరించాలని,వీకర్ సెక్షన్ కాలనీలో స్మశానవాటికనుఎర్పటుచేయాలని, కోరుతూ ధర్నా కార్యక్రమాలు జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పి.నిర్మల,పియస్,రాధాకృష్ణ ,నగర కార్యదర్శి టి.రాముడు,యన్ .అలివేలమ్మ హాజరై ధర్నాకు వచ్చిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారాలు వేయడమే పనిగా పెట్టుకుని పెట్రోల్, డిజల్ ,గ్యాస్,కరెంటు చార్జీలు ఆర్టీసీ చార్జీలు,ఇంటి పన్నులు, చెత్త పన్ను నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని వేశారుఅన్నారు. ప్రజల పైన వేసిన భారాల వలన ఆర్థికంగా కోలుకోలేక చాలా కష్టాల్లో ప్రజలు జీవిస్తున్నారు. ప్రజలను ఆర్థికంగా ఆదుకోవాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని, సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఏవిధంగా తగ్గించాలని కుటిల యత్నం తో ప్రభుత్వము కరెంట్ బిల్లు ఎక్కువ వచ్చిందని, ప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే పెద్ద ఇల్లు ఉన్నదని, లోను కొరకు ఇన్కమ్ టాక్స్ కట్టారని, రకరకాల కారణాలు చెప్పి రేషన్ కార్డులు, పెన్షన్లు, అమ్మ ఒడి, చేయుత వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు ఆపివేశారుఅన్నారు అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వాలని, డిమాండ్ చేశారు చిన్నవర్షం కురిసినా శ్రీరామనగర్ ,లక్ష్మీనగర్,లోతట్టుప్రాంతాలు జలమయంఅవుతున్నాయి ప్రజలు సర్వంకోల్పోతున్నారు .ప్రభుత్వం వెంటనే స్పందించి సుద్దవాగు కు రక్షణ గోడను నిర్మించాలని డిమ్యాండ్ చేశారు. జగన్నాథ గట్టు ఇళ్లలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి పెండింగ్లో ఉన్న ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం లోన్లు ఇచ్చి ఆదుకోవాలని, టిడ్కో ఇళ్ల కొరకు డీడీలు కట్టిన వారందరికీ ఆ ఇళ్లలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి వారి ప్లాట్లు వారికి వెంటనే అలాట్ చేయాలని, కోరుతున్నాము సిపిఎం పార్టీ వచ్చే నెల జులై 4వ తేదీన ప్రజల పై వేసిన భారాలకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం దగ్గర మహా ధర్నా కార్యక్రమం ఉంటుంది.ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపు ఇచ్చారు. సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు ,కె.సుదాకరప్ప,యండి,అంజిబాబు, యస్.శ్యామల,వి.లత,యం,జ మ్మన్న,ఎల్.ఎస్.రత్నమ్మ గార్లు మాట్లాడుతూ ఇంటి పన్నులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 15 శాతం పన్ను పెంచుతామని అటువంటి నిర్ణయం చాలా దుర్మార్గం. యజమాని తన ఇంటిలోనే తాను బాడుగకు ఉన్నట్లుగా చేయడమే అవుతుంది కనుక రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని, ప్రజలపై చెత్త పన్ను వసూలు చేయడాన్ని రద్దు చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నాం.

# ప్రపంచ సెపక్ తక్రా పోటీలకు శివకుమార్ ఎంపిక



కర్నూలు జూన్ 25 -: ప్రపంచ సెపక్ తక్రా జీన్స్ కప్ పోటీలకు మన రాష్ట్రానికి, కర్నూలు జిల్లాకు చెందిన శివకుమార్ భారత జట్టు తరపున పాల్గొంటారని సేపక్ తాక్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి జీ.శ్రీనివాసలు తెలిపారు.ఈ సందర్భంగా శనివారం కర్నూలు జిల్లా కలెక్టర్ కలవడం జరిగింది. జిల్లాకు ఎంపికైన శివకుమార్ ను కలెక్టర్ కోటేశ్వరరావు తన ఛాంబర్ లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా నుండి భారత జట్టుకు శివ కుమార్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు ప్రభుత్వ తరపున సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సెపక్ తాక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ శివకుమార్ జులై 23వ తేదీ నుండి 31వ తేదీ వరకు బ్యాంకాక్ లో జరిగే ప్రపంచ ఛాంపియన్షిప్ పోటీలకు భారత జట్టుకు ఎంపిక కావడం జరిగిందని శివ కుమార్ అనేక జాతీయ స్థాయి పోటీలలో అద్భుతం కనపరిచిన కారణంగా భారత జట్టులో స్థానం సంపాదించడం రాష్ట్రానికి గర్వకారణం. అలాగే భారత జట్టుకు థాయిలాండ్ శిక్షకుల ద్వారా 20 రోజులపాటు బ్యాంకాక్ లో శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నారనీ. ఆయన తెలిపారు. అనంతరం ప్రపంచం సేపక్ తక్రా చాంపియన్ షిప్ లో పాల్గొంటారనీ తెలిపారు. కలెక్టర్ ను కలిసిన వారిలో రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, రాష్ట్ర స్కేటింగ్ సంయుక్త కార్యదర్శి సునీల్, కుమార్ సీనియర్ క్రీడాకారుడు నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# బావ సినిమాకు బావమరిది స్విఛాన్



అక్కినేని నాగచైతన్య హీరోగా గురువారం లాంఛనంగా ప్రారంభమైన తాజా సినిమా చాలా ప్రత్యేకతలని సంతరించుకుంది. అక్కినేని నాగచైతన్య ఈ ఏడాది ప్రారంభం నుంచే స్పీడు పెంచేశారు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూనే వెబ్ సిరీస్ లోనూ నటిస్తూ ఆశ్చర్యపరిచారు. సిల్వర్ స్క్రీన్ పై హీరో మంచి డిమాండ్ వుండగానే వెబ్ సిరీస్ తో ఓటీటీ బాటపట్టి షాకిచ్చారు.'మనం' ఫేమ్ విక్రమ్ కె. కుమర్ డైరెక్షన్ లో ప్రస్తుతం 'థాంక్యూ' మూవీ చేస్తున్నారు. స్టార్ ప్రొడక్షన్ హౌస్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ ఈ మూవీని నిర్మిస్తోంది. రాశిఖన్నా అవికా గోర్ మాళవిక నాయన్ హీరోయిన్ లు గా నటిస్తున్న ఈ మూవీ షూటింగ్ పూర్తి చేసుకుని త్వరలో రిలీజ్ కి రెడీ అవుతోంది.ఇదిలా వుంటే నాగచైతన్య తాజాగా తమిళ దర్శకుడు వెంకట్ ప్రభుతో ఓ బైలింగ్వల్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్స్ బ్యానర్ పై శ్రీనివాస చిట్టూరి ఈ మూవీని నిర్మిస్తున్నారు. కృతిశెట్టి హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీ గురువారం హైదరాబాద్ లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమై చాలా ప్రత్యేకంగా నిలిచింది. పూజా కార్యక్రమాల అనంతరం హీరో నాగచైతన్య కృతిశెట్టిలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి స్టార్ డైరెక్టర్ బోయపాటి శ్రీను క్లాప్ నిచ్చారు. నాగచైతన్య బావ మరిది హీరో రానా కెమెరా స్విఛాన్ చేయడం ఈ మూవీ ప్రత్యేకత. టాలీవుడ్ లో చాలా రోజుల తరువాత ఈ అరుదై దృశ్యం కెమెరాలకు చిక్కడంతో దీనికి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారాయి. చై సినిమా లాంఛింగ్ ఈవెంట్ లో రానా పాల్గొని కెమెరా స్విఛాన్ చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇక ఇదే ఈ వెంట్ లో తమిళ క్రేజీ హీరో శివ కార్తికేయన్ తో పాటు పాపులర్ వెటరన్ డైరెక్టర్ భారతీరాజా కూడా పాల్గొన్నారు. ఈ సినిమాకు సంబంధించిన మరో విశేషం ఏంటంటే తండ్రీ కొడుకులు.. మ్యూజిక్ లెజెండ్ మాస్ట్రో ఇళయరాజా యువన్ శంకర్ రాజా తొలిసారి కలిసి సంగీతం అందిస్తుండటం విశేషం. ఇదొక అరుదైన కలయిక.ఇంత వరకు తండ్రీ కొడుకులు కలిసి ఏ సినిమాకు సంగీతం అందించలేదు. అది కూడా తొలి సారి తెలుగు హీరో నాగచైతన్య సినిమాకు కావడం విశేషం. ఇక క్లీన్ షేవ్ తో గుబురు మీసంకట్టు.. డిఫరెంట్ హెయిర్ స్టైల్ లో చాలా మాస్లీగా కనిపిస్తున్న హీరో నాగచైతన్య లుక్ కూడా ఈ ఈవెంట్ కు మరింత స్పెషల్ గా మారింది. గతంతో పోలిస్తే హీరో నాగచైతన్య ఈ ప్రారంభోత్సవంలో చాలా హాండ్సమ్ గా కనిపించి ఆకట్టుకున్న తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఇన్ని ప్రత్యేకతలతో ప్రారంభమైన ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కాబోతోంది. ఒకేసారి తెలుగుతో పాటు తమిళంలోనూ షూటింగ్ చేయబోతున్నారు. ఈ మూవీకి సంబంధించిన నటీనటులు సాంకేతిక నిపుణుల వివరాల్ని చిత్ర బృందం త్వరలోనే వెల్లడించనుంది.

# లారెన్సుడి రుద్ర తాండవం ఇదుగో

'కాంచన' సీరీస్ చిత్రాలతో హీరర్ కామెడీ చిత్రాలకు కెరాఫ్ అడ్రస్ గా నిలిచారు రాఘవ లారెన్స్. 'కాంచన 3' తరువాత ఆయన నుంచి సినిమా వచ్చి దాదాపు మూడేళ్లు దాటుతోంది. ఈ నేపథ్యంలో మరో పవర్ ఫుల్ మూవీతో ప్రేక్షకుల్ని ఎంటర్ టైన్ చేయడానికి రెడీ అయిపోతున్నారు. లారెన్స్ నటిస్తున్న తాజా చిత్రం 'రుద్రన్'. 'ఎవిల్ ఈజ్ నాట్ బోర్న్ ఇట్ ఈజ్ క్రియేటెడ్' అని ట్యాగ్ లైన్. కదిరేశన్ దర్శకత్వంలో ఫైవ్ స్టార్ క్రియేషన్స్ సంస్థ ఈ మూవీని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తోంది.రాఘవ లారెన్స్ సినిమాల్లోనే హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న మూవీని తెలుగులో 'రుద్రుడు'గా విడుదల చేయబోతున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్న ఈ మూవీని క్రిస్మస్ కానుకగా ఇదే ఏడాది తెలుగు తమిళ భాషల్లో ఏక




కాలంలో ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయబోతున్నారు. ఇటీవల ఈ మూవీ ప్రీ టుక్ ని విడుదల చేసి సినిమాపై అంచనాల్ని పెంచేసిన మేకర్స్ గురువారం ఫస్ట్ లుక్ పోస్టర్ ని విడుదల చేసి ఆ అంచనాల్ని మరింతగా పెంచేశారు.తజాఆగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ లో హీరో రాఘవ లారెన్స్ ఇంటెన్స్ అవతార్ లో కనిపిస్తున్నారు. ఓ ఫైట్ సీక్వెన్స్ కి సంబంధించి ఈ పోస్టర్ ని మేకర్స్ విడుదల చేశారు. సినిమాలో యాక్షన్ ఏ రేంజ్ లో వుండబోతోందో.. లారెన్స్ రుద్రతాండవం ఎలా వుంటుందో జస్ట్ శాంపిల్ గా ఈ పిక్ లో చూపించి సినిమాపై హైప్ రి క్రియేట్ చేశారు.అంతే కాకుండా 'ఎవిల్ ఈజ్ నాట్ బోర్న్ ఇట్ ఈజ్ క్రియేటెడ్' అని ట్యాగ్ లైన్ కి తగ్గట్టే లారెన్స్ ఎవిల్ లుక్ లో కనిపిస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. చేతిలో ఆయుధం పట్టుకుని విలన్ లపై లారెన్స్ రుద్ర తాండవం చేస్తున్న తీరు టెర్రిఫిక్ గా వుంది. మూవీకి సంబంధించి విశేషం ఏంటంటే కాంచన కాంబినేషన్ రిపీట్ అవుతుండటం. 'కాంచన'లో టైటిల్ పాత్రని పోషించి విమర్శకుల ప్రశంసల్ని సొంతం చేసుకున్న శరత్ కుమార్ ఈ మూవీలోనూ ఓ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. లారెన్స్ కు జోడీగా ప్రియా భవానీ శంకర్ నటిస్తున్న ఈ సినిమా ఇప్పటి వరకు సైలెంట్ గా 90 శాతం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుపుకుంటోంది.పూర్ణిమా భాగ్యరాజ్ నాజర్ తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి సంగీతం జీవీ ప్రకాష్ కుమార్ ఫొటోగ్రఫీ ఆర్ డీ రాజశేఖర్ ఎడిటింగ్ ఆంటోనీ స్టంట్స్ శివ – విక్కీ అందిస్తున్నారు. దర్శకుడు కదిరేశన్ నిర్మిస్తూ రూపొందిస్తున్న ఈ మూవీపై రాఘవ లారెన్స్ భారీ అంచనాలు పెట్టుకున్నారట. మూడేళ్ల విరామం తరువాత లారెన్స్ నుంచి థియేటర్లలోకి రానున్న ఈ మూవీ క్రిస్మస్ సందర్భంగా భారీ స్థాయిలో తెలుగుచ తమిళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కు సిద్ధమవుతోంది. భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న ఈ మూవీతో మళ్లీ లారెన్స్ ట్రాక్ లోకి రావడం ఖాయం అని చెబుతున్నారు.

# బాలయ్య అన్ స్టాపబుల్ 2 లో చిరు కన్ఫర్మ్.. కాని ఆ విషయం సస్పెన్స్

నందమూరి బాలకృష్ణ హోస్ట్ గా వ్యవహరిస్తున్న ఆహా ఓటీటీ అన్ స్టాపబుల్ టాక్ షో సీజన్ 2 కు ఏర్పాట్లు ముమ్మరం గా జరుగుతున్నాయి. మొదటి ఎపిసోడ్ ను ఆగస్టు లో లేదా కాస్త అటు ఇటుగా స్ట్రీమింగ్ చేసేందుకు గాను ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆహా టీమ్ ద్వారా సమాచారం అందుతోంది. ఇటీవలే ఆహా టీమ్ నుండి అన్ స్టాపబుల్ షో యొక్క సెకండ్ సీజన్ కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చింది.అన్ స్టాపబుల్ సీజన్ 1 మొదటి ఎపిసోడ్ లో మోహన్ బాబుతో బాలయ్య ఆడి పాడి సందడి చేసిన విషయం తెల్సిందే. ఆ ఎపిసోడ్ లోనే మోహన్ బాబుతో పాటు మంచు లక్ష్మి ఇతర మంచు స్టార్స్ కూడా వచ్చారు. ఇక మధ్యలో పలువురు స్టార్స్ షో లో సందడి చేశారు. అయితే సీజన్ 1 చివరి ఎపిసోడ్ మాత్రం సూపర్ స్టార్ మహేష్ బాబుతో ముగించిన విషయం తెల్సిందే.సీజన్ 1 కు మంచి ఆరంభం మరియు ముగింపు దక్కింది. అందుకే ఇప్పుడు సీజన్ 2 కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. ఇప్పుడు అందరి దృష్టి కూడా బాలయ్య అన్ స్టాపబుల్ సీజన్ 2 లో మొదటి గెస్ట్ ఎవరు అనే విషయం పై ఉంది. ఆహా టీమ్ నుండి ఇప్పటి వరకు ఎలాంటి లీడ్ కాని.. లీక్ కాని ఆ విషయమై రాలేదు. కాని ఒక విషయం మాత్రం వారు బలంగా చెబుతున్నారు.బాలయ్య అన్ స్టాపబుల్ సీజన్ 2 లో ఖచ్చితంగా చిరంజీవి గెస్ట్ గా రాబోతున్నాడు. బాలయ్య మరియు చిరంజీవి ఎపిసోడ్ కోసం తెలుగు ఓటీటీ ప్రేక్షకులు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరు కూడా చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు అంటూ ఆహా టీమ్ వారు చెబుతున్నారు. వారిద్దరి కలయికలో ఖచ్చితంగా అన్ స్టాపబుల్ ఎపిసోడ్ ఉంటుందని వారు నమ్మకంగా ఉన్నారు.అన్ స్టాపబుల్ లో చిరంజీవి సందడి చేయడం కన్ఫర్మ్ కాని... చిరు వచ్చేది ఫస్ట్ ఎపిసోడ్ లోనా.. లేదంటే సీజన్ 2 చివరి ఎపిసోడ్ లోనా అనేది క్లారిటీ రావాల్సి ఉంది. ఆ విషయం ఇప్పట్లో తేలేది కాదు. ఒక వేళ చిరంజీవి



మొదటి ఎపిసోడ్ లో వస్తే ఇప్పటికే వారిద్దరి మధ్య జరిగే సంభాషణలు మరియు గేమ్స్ కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ రెడీ అవుతూ ఉండాలి.కాని ఇప్పటి వరకు అలాంటిది ఏమీ లేదు కనుక అన్ స్టాపబుల్ చివరి ఎపిసోడ్ వరకు బాలయ్య.. మెగా అభిమానులు వెయిట్ చేయాల్సి రావచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# ఐర్లాండ్‌తో సిరీస్.. నాడు తుది జట్టులో డీకే.. డ్రింక్స్ మోసిన ధోని! వైరల్!



మహేంద్ర సింగ్ ధోని.. మిస్టర్ కూల్.. సింప్లిసిటీకి మారుపేరు.. యువ ఆటగాళ్లను ప్రోత్సహించడంలో మేటి.. అంతేనా జట్టు ప్రయోజనాల కోసం తన స్థానాన్ని కూడా త్యాగం చేయగలడు.. తాను అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న సమయంలో ఎన్నో సార్లు ఈ విషయాన్ని నిరూపించాడు ధోని.ఇక ఐర్లాండ్‌తో టీమిండియా జూన్ 26 నుంచి టీ20 సిరీస్ ఆడనున్న నేపథ్యంలో ధోని సింప్లిసిటీకి సంబంధించిన ఫొటోలు తాజాగా వైరల్ అవుతున్నాయి. కాగా 2018లో భారత జట్టు ఐర్లాండ్‌లో పర్యటించింది. విరాట్ కోహ్లి కెప్టెన్సీలో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడింది.ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో ధోని 5 బంతులు ఎదుర్కొని 11 పరుగులు చేసి అవుటయ్యాడు. ఈ క్రమంలో రెండో మ్యాచ్‌లో ధోని స్థానంలో మరో వికెట్ కీపర్ బ్యాటర్ దినేశ్ కార్తిక్ తుది జట్టులోకి వచ్చాడు. ఈ నేపథ్యంలో ధోని వాటర్‌బాయ్ అవతారం ఎత్తాడు. టీమిండియా బ్యాటింగ్ చేస్తున్న సమయంలో సహచర ఆటగాళ్లకు డ్రింక్స్ అందించాడు.ఇందుకు సంబంధించిన ఫొటోలు అప్పట్లో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. తాజా సిరీస్ నేపథ్యంలో అభిమానులు వాటిని వెలికి తీసి రీషేర్ చేస్తున్నారు. ఇవి చూసిన నెటిజన్లు ధోని నిరాడంబరతకు అద్దం పట్టే దృశ్యాలు ఇవి అంటూ అతడిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.ఇక 2018 సిరీస్ విషయానికొస్తే కోహ్లి సేన మొదటి మ్యాచ్‌లో 76, రెండో మ్యాచ్‌లో 143 పరుగుల భారీ తేడాతో గెలుపొంది ట్రోఫీ సొంతం చేసుకుంది. అయితే, ధోని స్థానంలో రెండో మ్యాచ్‌కు జట్టులోకి వచ్చిన డీకేకు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. తొలి టీ20లో కుల్దీప్ యాదవ్(4 వి?కెట్లు), రెండో టీ20లో కేఎల్ రాహుల్ (36 బంతుల్లో 70 పరుగులు)ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందుకున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**